# తెలుగురాష్ట్రం

APTEL/2016/66202

తెలుగు దినపత్రిక

అమలాపురం | సంపుటి : 11 సంచిక : 144 | ఎడిటర్ : ఎ. రాజశేఖర్ | శనివారం 26 సెప్టెంబర్ 2026 | పేజీలు 8 వెల : 5/-

published : Amalapuram Vol:11 Issue : 144 26-09-2026 Editor : A.RAJASEKHAR Pages : 8 Rs: 5/-


## ఏపీ పొగాకు రైతులకు కేంద్రం తీపి కబురు

**ఒక్కో బ్యారన్‌కు రూ. 50,000 చొప్పున వడ్డీలేని రుణం మంజూరు కేంద్రం నిర్ణయం**



అమరావతి సెప్టెంబర్ 25 (తెలుగురాష్ట్రం ప్రతినిధి)

ఆంధ్రప్రదేశ్‌లోని ఫ్లూ–క్యూర్డ్ వర్జీనియా (ఎఫ్‌సీవీ) పొగాకు రైతులకు ఊరట కల్పిస్తూ కేంద్ర ప్రభుత్వం కీలక నిర్ణయం తీసుకుంది. మారుతున్న ప్రపంచ మార్కెట్ పరిస్థితుల నేపథ్యంలో రైతులకు సకాలంలో ఆర్థిక చేయూత

- తరువాయి 2లో..

## యూపీఐ లావాదేవీలపై చార్జీలు.. వినియోగదారులకు భారం లేదు నిర్మలా సీతారామన్

**ఎండీఆర్ చార్జీలపై వినియోగదారులు ఆందోళన చెందాల్సిన అవసరం లేదన్న నిర్మల**

**ఈ చార్జీలు కేవలం వ్యాపారులకు మాత్రమే పరిమితమని స్పష్టీకరణ**

**నిబంధనలపై అవగాహన లోపం వల్లే అపోహలు వ్యాపిస్తున్నాయని వ్యాఖ్య**



న్యూఢిల్లీ : యూపీఐ డిజిటల్ చెల్లింపులపై మర్చంట్ డిస్కౌంట్ రేట్ (ఎండీఆర్) చార్జీలు విధించనున్నారనే ప్రచారంపై కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ స్పష్టత ఇచ్చారు. ఈ అంశంతో సాధారణ ఖాతాదారులు లేదా వినియోగదారులు ఆందోళన చెందాల్సిన అవసరం లేదని, వారి జేబుపై ఎలాంటి అదనపు భారం పడదని తెలిపారు. రూ.2,000కు మించిన కొన్ని నిర్దిష్ట డిజిటల్ లావాదేవీలకు ఎండీఆర్ వర్తించినా, అది వినియోగదారులకు కాదని, వ్యాపారులకే పరిమితమని మంత్రి చెప్పారు. ఢిల్లీలో మీడియాతో మాట్లాడుతూ ఆమె ఈ మేరకు స్పష్టతనిచ్చారు. ఎండీఆర్ అనేది కేంద్ర ప్రభుత్వం వసూలు చేసే పన్ను, సెస్ లేదా సర్‌చార్జ్ కాదని... ఆ మొత్తం ప్రభుత్వ ఖజానాకు వెళ్లదని స్పష్టం చేశారు. బ్యాంకులు, పేమెంట్ గేట్‌వేలు వంటి డిజిటల్ చెల్లింపు వ్యవస్థ నిర్వహణకు సంబంధించిన ఖర్చుల కోసం ఈ రుసుము ఉంటుందని వివరించారు. ఎండీఆర్ నిబంధనలపై అవగాహన

- తరువాయి 2లో..

## ఏపీలో దసరా కానుకగా 'ఆడబిడ్డ' నిధి కింద రూ.18,000?

అమరావతి సెప్టెంబర్ 25 (తెలుగురాష్ట్రం ప్రతినిధి)



సామాజిక మాధ్యమాల్లో ప్రస్తుతం 'ఆడబిడ్డ నిధి' పథకానికి సంబంధించిన ఒక వార్త తెగ చక్కర్లు కొడుతోంది. రాబోయే దసరా పండుగ కానుకగా రాష్ట్రంలోని అర్హులైన మహిళల ఖాతాల్లో ప్రభుత్వం ఏకకాలంలో రూ.18,000 జమ చేయనుందనే ప్రచారం విస్తృతంగా సాగుతోంది. దీంతో ఈ పథకం ప్రయోజనాలు ఎప్పుడు అందుతాయా అని లబ్ధిదారులు ఆసక్తిగా ఎదురుచూస్తున్నారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి రాకముందు ప్రకటించిన 'సూపర్ సిక్స్' హామీల్లో 'ఆడబిడ్డ నిధి' పథకం ఒకటి. ఈ పథకం ముఖ్య ఉద్దేశం పేదరికంలో ఉన్న మహిళలకు ఆర్థిక చేయూతనివ్వడం. దీని ప్రకారం 18 నుంచి 59 ఏళ్ల వయస్సు కలిగిన, దారిద్ర్యరేఖకు దిగువన (బీపీఎల్) ఉన్న అర్హులైన ప్రతి మహిళకు నెలకు రూ.1,500 చొప్పున ఆర్థిక సాయం అందిస్తారు. ఈ లెక్కన ఏడాదికి మొత్తం రూ.18,000 లబ్ధిదారుల ఖాతాల్లో జమ కానుంది.

**దసరాకు రూ.18,000 జమ నిజమేనా?**

తాజాగా సామాజిక మాధ్యమాల్లో

- తరువాయి 2లో..

## దీన్‌దయాళ్ ఆలోచనలే వికసిత్ భారత్‌కు దిక్సూచి ప్రధాని మోదీ

- దీన్‌దయాళ్ జయంతి సందర్భంగా మోదీ నివాళి
- వ్యక్తి ప్రగతి సమాజ హితంతో ముడిపడి ఉండాలన్నదే దీన్‌దయాళ్ సిద్ధాంతమని వెల్లడి
- అభివృద్ధి ఫలాలు అందరికీ అందాలనేదే అంత్యోదయ లక్ష్యమని వ్యాఖ్య



న్యూఢిల్లీ : స్వదేశీ భావజాలంతో దేశాభివృద్ధికి ప్రత్యేక దృక్పథాన్ని అందించిన మహనీయుడు పండిట్ దీన్‌దయాళ్ ఉపాధ్యాయ అని ప్రధాని మోదీ కొనియాడారు. ఆయన ప్రతిపాదించిన ఏకాత్మ మానవతావాదం, అంత్యోదయ స్ఫూర్తే బీజేపీకి, తమ ప్రభుత్వాల నిర్ణయాలకు మార్గదర్శకమని పేర్కొన్నారు. వ్యక్తి ప్రగతి సమాజం నుంచి వేరుగా కాకుండా, సమాజ హితంతో ముడిపడి ఉండాలన్నదే దీన్‌దయాళ్ సిద్ధాంత సారమని చెప్పారు. ప్రకృతిని దెబ్బతీయకుండా సమాజం పురోగమించేలా అభివృద్ధి నమూనా ఉండాలని ఆయన ఆలోచనలు చెబుతాయని వివరించారు. దీన్ దయాళ్ జయంతి సందర్భంగా

- తరువాయి 2లో..

## 13 నెలల్లోనే గూగుల్.. 17 నెలల్లో ఆర్సెలర్.. ఏపీ స్పీడ్ ఇదేనన్న లోకేశ్



**వికసిత్ భారత్ నిర్మాణంలో ఏపీని గ్రోత్ ఇంజన్‌గా నిలుపుతామన్న లోకేశ్**

**గుజరాత్, ఏపీ కలిసి పనిచేస్తే అద్భుతాలు సృష్టించవచ్చని వ్యాఖ్య**

అమరావతి సెప్టెంబర్ 25 (తెలుగురాష్ట్రం ప్రతినిధి)

2047 నాటికి వికసిత్ భారత్ నిర్మాణంలో ఆంధ్రప్రదేశ్ ప్రధాన గ్రోత్ ఇంజన్‌గా నిలవాలని, ఈ అభివృద్ధి ప్రయాణంలో పెట్టుబడిదారులు భాగస్వాములు కావాలని రాష్ట్ర ఐటీ, విద్యాశాఖ మంత్రి నారా లోకేశ్ పిలుపునిచ్చారు. అహ్మదాబాద్‌లో సీఐఐ (కాన్ఫడరేషన్ ఆఫ్ ఇండియన్ ఇండస్ట్రీ) ఆధ్వర్యంలో జరిగిన పార్ట్‌నర్‌షిప్ సమ్మిట్ రోడ్‌షోలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. గుజరాత్ పారిశ్రామిక స్ఫూర్తి దేశానికి ఆదర్శమని, ప్రధాని నరేంద్ర మోదీ నాయకత్వంలో ఆ రాష్ట్రం సాధించిన ప్రగతి అద్భుతమని కొనియాడారు. వైబ్రంట్ గుజరాత్ మోడల్ స్ఫూర్తితో ఏపీ కూడా శరవేగంగా దూసుకెళ్తోందని, ఈ ప్రగతిలో గుజరాత్ పారిశ్రామిక రంగం భాగస్వామి కావాలని ఆయన కోరారు. ముఖ్యమంత్రి చంద్రబాబు

- తరువాయి 2లో..

## ప్రస్తుత నియామక చట్టాన్ని సవరించాలి



**కేంద్రానికి జగన్ డిమాండ్**

**ఎన్నికల సంఘంలో విభేదాలు అంటూ కథనం.. ఆందోళన వ్యక్తం చేసిన జగన్**

**ప్రధాని, ప్రతిపక్ష నేతతో పాటు సీజేఐ కూడా కమిటీలో ఉండాలన్న జగన్**

అమరావతి సెప్టెంబర్ 25 (తెలుగురాష్ట్రం ప్రతినిధి)

కేంద్ర ఎన్నికల సంఘం (ఈసీ)లో అంతర్గత విభేదాలు ఉన్నట్టు జాతీయ మీడియాలో కథనం రావడం, దేశవ్యాప్తంగా ప్రకంపనలు రేగడంపై వైసీపీ అధినేత, ఏపీ మాజీ సీఎం జగన్ స్పందించారు. ఈసీ పనితీరు, నియామకాల పద్ధతిపై తీవ్ర ఆందోళన వ్యక్తం చేశారు. ప్రజాస్వామ్య వ్యవస్థలో ఎన్నికల సంఘం వంటి రాజ్యాంగబద్ధ సంస్థలపై ప్రజలకు సంపూర్ణ విశ్వాసం ఉన్నప్పుడే ప్రజాస్వామ్యం నిలబడుతుందని అభిప్రాయపడ్డారు. ఈ మేరకు శుక్రవారం ఆయన సోషల్ మీడియా వేదికగా ఒక సుదీర్ఘ పోస్ట్ చేశారు. ఎన్నికల కమిషనర్ల

- తరువాయి 2లో..

## గంగమ్మ ఒడికి ఖైరతాబాద్ మహాగణపతి...

**69 అడుగుల పంచముఖ గణపతిగా దర్శనమిచ్చిన విగ్రహం ప్రశాంతంగా ముగిసిన నిమజ్జనం**




హైదరాబ్ సెప్టెంబర్ 25 (తెలుగురాష్ట్రం ప్రతినిధి)

హైదరాబాద్‌లోని అత్యంత ప్రతిష్ఠాత్మకమైన ఖైరతాబాద్ మహాగణపతి నిమజ్జన వేడుకలు శుక్రవారం ప్రశాంతంగా ముగిశాయి. ఈ ఏడాది 69 అడుగుల ఎత్తుతో 'పంచముఖ సంకటహర మహాగణపతి'గా భక్తులకు దర్శనమిచ్చిన స్వామివారి విగ్రహాన్ని వేలాది మంది భక్తుల జయజయధ్వానాల మధ్య హుస్సేన్‌సాగర్‌లో నిమజ్జనం చేశారు. ఉదయం 9.30 గంటలకు ఖైరతాబాద్ నుంచి మహాగణపతి శోభాయాత్ర వైభవంగా ప్రారంభమైంది. యాత్ర ప్రారంభంలో దానం నాగేందర్ గణనాథుడి ఎదుట డ్యాన్స్ చేసి

- తరువాయి 2లో..

## హైదరాబాద్‌లో మన్మోహన్ సింగ్ విగ్రహం.

**నేడు ఆవిష్కరించనున్న సీఎం రేవంత్ రెడ్డి**

హైదరాబాద్, సెప్టెంబర్ 25 (తెలుగురాష్ట్రం ప్రతినిధి)

మాజీ ప్రధానమంత్రి, ప్రముఖ ఆర్థికవేత్త డాక్టర్ మన్మోహన్ సింగ్ జయంతి సందర్భంగా హైదరాబాద్‌లో ఆయన విగ్రహాన్ని ఆవిష్కరించేందుకు తెలంగాణ ప్రభుత్వం ఏర్పాట్లు పూర్తి చేసింది. నగరంలోని ఐటీ కారిడార్ అయిన గచ్చిబౌలి విప్రో సర్కిల్ వద్ద ఏర్పాటు చేసిన ఈ కాంస్య విగ్రహాన్ని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి శనివారం (సెప్టెంబరు 26) ఆవిష్కరించనున్నారు. ఈ కార్యక్రమ ఏర్పాట్లను హైదరాబాద్ ఇన్‌చార్జి మంత్రి పొన్నం ప్రభాకర్ శుక్రవారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. మన్మోహన్ సింగ్ దేశానికి అందించిన సేవలను స్మరించుకున్నారు. ఈ విగ్రహం కేవలం ఒక స్మారక చిహ్నం కాదని, దేశ

- తరువాయి 2లో..



## నవంబర్ 1 నుంచి ఖరీఫ్ ధాన్యం కొనుగోళ్లు..

- 37 లక్షల టన్నుల సేకరణ లక్ష్యం: నాదెండ్ల మనోహర్
- విజయవాడలో పౌరసరఫరాల శాఖ ఆధ్వర్యంలో వర్క్‌షాప్
- రాష్ట్ర వ్యాప్తంగా 2,619 ధాన్యం కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేస్తామన్న నాదెండ్ల
- ధాన్యం తరలించేందుకు 31 వేల వాహనాలను అందుబాటులో ఉంచనున్నట్టు వెల్లడి

అమరావతి సెప్టెంబర్ 25 (తెలుగురాష్ట్రం ప్రతినిధి)



ఆంధ్రప్రదేశ్‌లో ఖరీఫ్ ధాన్యం సేకరణ కార్యక్రమాన్ని నవంబర్ 1న ప్రారంభించనున్నట్లు పౌరసరఫరాల శాఖ మంత్రి నాదెండ్ల మనోహర్ తెలిపారు. విజయవాడలో పౌరసరఫరాల శాఖ నిర్వహించిన వర్క్‌షాప్‌లో మాట్లాడిన ఆయన, రైతులకు ఇబ్బందులు లేకుండా కొనుగోలు, రవాణా, మిల్లింగ్ ప్రక్రియకు సమగ్ర ఏర్పాట్లు చేస్తున్నామని చెప్పారు. రాష్ట్ర వ్యాప్తంగా 2,619 ధాన్యం కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేసి, 37 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం సేకరించాలని లక్ష్యంగా పెట్టుకున్నామని మంత్రి తెలిపారు. సేకరణ ప్రక్రియ కోసం 24 వేల మంది సిబ్బందిని నియమించగా, కల్లాల నుంచి మిల్లులకు ధాన్యం తరలించేందుకు 31 వేల వాహనాలను అందుబాటులో ఉంచనున్నట్టు వెల్లడించారు. ఈసారి రైతులకు

- తరువాయి 2లో..

## జనసేనలో చేరిన యనమల కృష్ణుడు, నవీన్ నిశ్చల్



అమరావతి సెప్టెంబర్ 25 (తెలుగురాష్ట్రం ప్రతినిధి)

ఆంధ్రప్రదేశ్ రాజకీయాల్లో జనసేన పార్టీలోకి చేరికల పర్వం కొనసాగుతోంది. అధికారంలోకి వచ్చిన తర్వాత పార్టీ బలోపేతంపై దృష్టి సారించిన జనసేన, తాజాగా వైసీపీకి గట్టి షాక్ ఇచ్చింది. పలు నియోజకవర్గాలకు చెందిన కీలక

- తరువాయి 2లో..



## అంబటి రాంబాబుకు మరోసారి ఈడీ నోటీసులు

- మద్యం రవాణా కుంభకోణం కేసు
- ఇటీవలే అంబటికి నోటీసులు జారీ చేసిన ఈడీ
- మరో తేదీ కేటాయించాలని కోరడంతో కొత్త తేదీ ఇచ్చిన ఈడీ

అమరావతి సెప్టెంబర్ 25 (తెలుగురాష్ట్రం ప్రతినిధి)



ఆంధ్రప్రదేశ్ మద్యం రవాణా కుంభకోణం కేసు దర్యాప్తులో భాగంగా మాజీ మంత్రి, వైసీపీ నేత అంబటి రాంబాబుకు ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ మరోసారి నోటీసులు జారీ చేసింది. తొలుత కేటాయించిన విచారణ తేదీకి బదులుగా కొత్త తేదీ ఇవ్వాలని ఆయన కోరడంతో, ఈ నెల 28న విచారణకు హాజరు కావాలని ఈడీ తాజా నోటీసుల్లో పేర్కొంది. మద్యం రవాణా కాంట్రాక్టులు, సబ్‌కాంట్రాక్టుల కేటాయింపులకు సంబంధించిన ఆర్థిక లావాదేవీలపై ఈడీ విచారణ జరుపుతున్న సంగతి తెలిసిందే. ఆంధ్రప్రదేశ్ స్టేట్ బేవరేజెస్ కార్పొరేషన్ డిపోల నుంచి ప్రభుత్వ మద్యం దుకాణాలకు సరఫరా చేసే రవాణా వ్యవస్థలో జరిగినట్లు ఆరోపణలున్న అక్రమాలపై ఈ కేసు నమోదైంది. 2020లో జారీ చేసిన కేంద్రీకృత రవాణా టెండర్, తదనంతరం కాంట్రాక్టులు, సబ్‌కాంట్రాక్టుల కేటాయింపులే దర్యాప్తులో ప్రధాన అంశాలుగా ఉన్నాయి.

## కోర్టు తుది తీర్పు వచ్చిన వెంటనే ఎన్నికలకు చర్యలు




అమరావతి సెప్టెంబర్ 25 (తెలుగురాష్ట్రం ప్రతినిధి)

ఆంధ్రప్రదేశ్ వ్యాప్తంగా స్థానిక సంస్థల మరియు మున్సిపల్ ఎన్నికల నిర్వహణపై గత కొంతకాలంగా ఉత్కంఠ నెలకొంది. ఈ క్రమంలో మున్సిపల్ ఎన్నికల ప్రక్రియపై మంత్రి నారాయణ పూర్తి స్పష్టత ఇచ్చారు. ఎన్నికల నిర్వహణకు సంబంధించి పలు పిటిషన్లపై న్యాయస్థానాల్లో ప్రస్తుతం విచారణలు జరుగుతున్నాయని ఆయన తెలిపారు. కొన్ని కీలక అంశాలపై కోర్టులు తీర్పులను రిజర్వులో ఉంచగా, మరికొన్ని పిటిషన్లపై వాదనలు కొనసాగుతున్నాయి. న్యాయపరమైన చిక్కులన్నీ తొలగి, కోర్టు నుండి పూర్తి క్లియరెన్స్ (అనుమతి) వచ్చిన వెంటనే ఏపీ వ్యాప్తంగా

- తరువాయి 2లో..

## బ్యాంకుల సమ్మె ఎఫెక్ట్.. ఏపీలో మారిన పింఛన్ల పంపిణీ షెడ్యూల్

**అక్టోబర్ 1న మధ్యాహ్నం నుంచి ఎన్టీఆర్ భరోసా పింఛన్ల పంపిణీ**

అమరావతి సెప్టెంబర్ 25 (తెలుగురాష్ట్రం ప్రతినిధి)



ఏపీలో అక్టోబర్ నెలకు సంబంధించిన 'ఎన్టీఆర్ భరోసా' పింఛన్ల పంపిణీ సమయంలో స్వల్ప మార్పు చోటుచేసుకుంది. ప్రతి నెలా 1వ తేదీ ఉదయం ప్రారంభమయ్యే పింఛన్ల పంపిణీ, ఈసారి మాత్రం మధ్యాహ్నం నుంచి మొదలుకానుంది. ఈ మేరకు అవసరమైన చర్యలు తీసుకోవాలని మంత్రి కొండపల్లి శ్రీనివాస్ అధికారులను ఆదేశించారు. ఈ నెల చివరి వారంలో బ్యాంకులకు వరుస సెలవులు, సమ్మె ఉండటమే

- తరువాయి 2లో..

తెలుగురాష్ట్రం దినపత్రిక

# సంపాదకీయం

## ఉద్యోగుల బకాయి సమస్యలకు ఏదీ పరిష్కారం?

ఎలక్షన్లు వచ్చినప్పుడు ప్రభుత్వ ఉద్యోగులకు రాజకీయ పార్టీలు సహజంగా కొన్ని హామీలిస్తుంటాయి. ఈ క్రమంలో ప్రభుత్వాలు ఏర్పడిన తర్వాత ఉద్యోగుల విష యంలో సమస్యలను కొన్నిసార్లు ఆర్థిక స్థితిగతుల అంచనా ల ప్రకారం ప్రభుత్వాలు తాత్సారం చేసే పరిస్థితులు కొన సాగుతున్నాయి అనే భిన్న అభిప్రాయాలు అడపాదడపా వినిపిస్తుంటాయి. అయినప్పటికి సాధ్యమైనంతగా ప్రభుత్వాలు సామరస్యంగా ప్రభుత్వ ఉద్యోగ సంఘాల నేతలతో చర్చించి సానుకూల దృక్పథంతో సమస్యలను పరిష్కరించే దిశగా ప్రభుత్వాలు ప్రయత్నిస్తుండడం సర్వసాధారణ మే. ఈ క్రమంలో తరచుగా ప్రభుత్వాలు ఏర్పడిన తర్వాత ఇచ్చిన హామీలను ఉద్యోగస్తులు అడుగుతుంటారు. కొన్ని సందర్భా ల్లో చాలా సంవత్సరాలుగా అపరిష్కృతంగా ఉన్న సమస్య లను వీలైనంత త్వరగా పరిష్కరించే ధోరణితో ఉద్యోగ సం ఘాలతో చర్చలు జరిపే సమయంలో ప్రభుత్వాలు స్పష్ట మైన హామీ ఇవ్వలేని పరిస్థితుల్లో ప్రభుత్వ ఉద్యోగులు ప్రభుత్వాలపై నిరసన వ్యక్తం చేస్తుండడం సహజమే. రోజు రోజుకీ పెరుగుతున్న ధరలు ద్రవ్యోల్బణం ఆధారంగా ఉద్యోగులకు సహజంగా రావలసినటువంటి పే రివిజన్ కమీషన్ గాని, డి.ఎ అంటే డియర్నెస్ అలవెన్సులు సకా లంలో రాకపోవడం ఒక ఎత్తు అయితే పదవి విరమణ పొందిన తర్వాత విరమణ పొందిన ఉద్యోగులకు రావలసిన ఆర్థిక లావాదేవీలు సంపూర్ణంగా చేతికి అందకపోవడంతో పదవి విరమణ పొందిన ఉద్యోగులకు నిరాశను కలిగిస్తు న్నాయి. ఇలాంటి విషయాలపై ప్రభుత్వాలలో భాగమైన ఉద్యోగస్తులు ఉద్యమ బాట పట్టడానికి సిద్ధమవుతున్న తీరు శోచనీయమేమో.

**హామీలు నిష్ప్రయోజనంగానే గోచరి స్తున్నాయనే చర్చ**

కొన్ని రాష్ట్రాల్లో ఉద్యోగుల బదిలీల విష యంలో అనేక రకాల సమస్యలు తలెత్తుతున్నాయని స్థాని కత, స్థానికేతర ఉద్యోగుల విషయంలో ఇంకా స్పష్టత రావాల్సి ఉందని గతం నుండి ప్రభుత్వాలు తీసుకున్న జీవోలో ఉన్న స్పష్టత లేని అంశాలపై ఉన్న విషయాలు కాంట్రిబ్యూటెడ్ సీ.పి.ఎస్ పెన్షన్ స్కీం ప్రకారం ఉద్యోగ నియామకాలు ప్రస్తుతం జరుగుతున్నా ఉద్యోగం వచ్చిన తర్వాత వారు తిరిగి తమకు పాత పెన్షన్ విధానాన్ని ఓ.పి.ఎస్ అమలు చేయాలని ఉ ద్యోగుల విజ్ఞప్తి మేరకు సాధ్యాసాధ్యాలను పక్కనపెట్టి రాజకీయ పార్టీలు అధికారం లోకి వచ్చే ముందు నెరవేరుస్తామని హామీలను ఇస్తున్న ప్పటికీ, ప్రభుత్వాలు ఏర్పడిన తర్వాత ఉద్యోగుల విషయం లో కొన్నిసందర్భాల్లో హామీలు నిష్ప్రయోజనంగానే గోచరి స్తున్నాయనే చర్చ ఉద్యోగ సంఘాల్లో సాగుతుంది.

దేశంలో కొన్ని రాష్ట్రాల్లో ప్రభుత్వ ఉద్యోగాల్లో ఉన్న అనేక రకమైన టువంటి ఉద్యోగ సంఘాలు సంబంధిత శాఖలకు సంబంధించిన వారి సమస్యలు పరిష్కరించాల్సి ఉందన్న వాదన తో ఉద్యోగులు, విశ్రాంత ఉద్యోగులు వివిధ సంఘాల ఐక్య కార్యాచరణతో ఉద్యమ బాటను పడుతూ తరచుగా ప్రభు త్వాలతో చర్చలు విఫలమైన సందర్భాలలో కొన్ని సార్లు నిరసనలు వ్యక్తం చేస్తుండడం సాధారణమైపోయింది. ప్రభు త్వాలు ఉద్యోగ సంఘాల మధ్య జరుగుతున్న చర్చలుకొన్ని సార్లు కనీస స్థాయిలో నైనా సఫలం కాకపోవడం ఉద్యోగు లలో ఆందోళనలు కలిగిస్తుంది.

**ఆర్థికపరమైన లావాదేవీలు అసంపూర్ణం**

సర్వీస్లో ఉన్న ఉపాధ్యా యులతో సహా పదవీ విరమణ పొందిన ఉద్యోగులకు నిర్ణీత సమయంలో రావలసినటువంటి ఆర్థికపరమైన లావాదేవీలు అంశాలు అసంపూర్ణంగా ఉంటున్నాయనే భావన పదవి విరమణ పొందిన ఉద్యోగులలో లేకపోలేదు. జీతాల పెంపు విష యమై వేతన సవరణ కమిషన్ల నివేదికలు కూడా అంది అందినట్టే ఉంటున్నాయి అనే భావన ఉద్యోగులలో లేకపో లేదు. ముఖ్యంగా కొన్ని రాష్ట్రాల్లో కూడా ఈ అంశం చర్చనీ యాంశంగా మారుతుంది. అయితే గతంనుండి కూడాఉద్యో గుల విషయంలో సరైన రీతుల్లో ప్రభుత్వాలు స్పందించక పోవడం ఒక ఎత్తు అయితే కారణాలేవైనా ప్రభుత్వాలు ఆశించిన స్థాయిలో ప్రభుత్వ ఉద్యోగ సంక్షేమ విషయంలో కొంత జాప్యం చేస్తున్నాయి అనే వాదనలు వినిపిస్తుంటా యి. మరీ ముఖ్యంగా చాలా సంవత్సరాలు ప్రభుత్వ సర్వీస్లో ఉండి పదవీ విరమణ పొందిన వారి పరిస్థితి ప్రస్తుతమున్న పరిస్థితులు విశ్రాంతిగా కుటుంబ సభ్యులతో కాలం గడిపే సమయంలో తమకు రావాల్సిన ప్రభుత్వ బకాయిలు గురించి ఆలోచిస్తూ సంబంధిత కార్యాలయం చుట్టూ తిరుగుతు ఉన్న సందర్భాల్లో ప్రస్తుతం అందుకే విశ్రాంత ఉపాధ్యాయులు అవిశ్రాంతంగా ఉంటున్నారని అనిపిస్తుంది. కారణాలేవైనా ప్రభుత్వాలు న్యాయపరమైన ఉద్యోగుల సమస్యలను సత్వరమే త్వరితగతిన పరిష్కరిం చాలి.

**ప్రభుత్వాలతో అవిశ్రాంతంగా పోరాటం**

ఉద్యోగులకు ఎదురయ్యే సమస్యలను ప్రభుత్వంసామ రస్యంతో పరిష్కరించే రీతిలో కొన్ని ఉన్నప్పటికీ, మరికొన్ని అంశాలు ఆర్థిక స్థితిగతులపై ముడిపడి ఉండడం వల్ల ప్రభు త్వ ఉద్యోగులు అనుకున్న రీతిలో సమస్యల పరిష్కారం ఆశించిన స్థాయిలో లేకపోవడం జరుగుతుందనే విభిన్నమైన అభిప్రాయాలు లేకపోలేదు. అయితే ఐదేళ్లకోసారి ప్రభుత్వా లు మారుతున్నా, ఇందుకు భిన్నంగా ప్రభుత్వ ఉద్యోగులు పదవీ విరమణ వయస్సు వరకు ఉద్యోగంలో పనిచేస్తుంటారు. ఈక్రమంలో ప్రభుత్వ విధానాలను అమలు పరుస్తుం టారు. దేశ రాష్ట్ర ఆర్థికవిధానాలు ప్రజా సంక్షేమ అభివృద్ధి వివిధ వ్యవస్థల్లో సహాయ సహకారాలు అందజేస్తున్నారు. ప్రభుత్వాలు ప్రజల కొరకు తీసుకునే నిర్ణయాత్మక అభివృద్ధి ప్రణాళికలో కీలకపాత్ర ప్రభుత్వ ఉద్యోగులు నిర్వహిస్తుంటారు. ప్రభుత్వాలు స్వచ్ఛమైన పరిపాలనను అందించే రీతిలో ఉద్యోగుల పాత్ర కూడా కీలకమైనది. ప్రస్తుత పరిస్థితుల్లో పదవీ విరమణ పొందిన తర్వాత ఉద్యోగులకు రావలసిన ఆర్థిక లావాదేవీలు సకాలంలో సంపూర్ణంగా చేతికి అందక పోవడంతో పదవీ విరమణ పొందిన ఉద్యోగులకు నిరాశను కలిగిస్తున్నాయి. అనేక సంవత్సరాలు ప్రభుత్వ శాఖల్లో సేవలు అందించి పదవీ విరమణ తర్వాత విశ్రాంతి తీసుకో వాల్సిన సమయంలో రావలసిన బకాయిల గురించి ప్రభు త్వాలతో అవిశ్రాంతంగా పోరాటం చేస్తున్న క్రమం విశేషం. ఏది ఏమైనప్పటికీ రాష్ట్ర ప్రభుత్వ ఉపాధ్యాయులు, వివిధ శాఖల్లో పనిచేస్తున్న ఉద్యోగస్తులు, విశ్రాంత ఉద్యోగుల సమ స్యల పరిష్కారానికి ప్రస్తుత ప్రభుత్వాలు సమన్వయంతో, సామరస్యంతో సానుకూల ధోరణికలిగి ఉద్యోగుల సమస్యల పరిష్కారానికి చిత్త శుద్ధితో మరింతగా కృషి చేయాలి.

## ఏపీ పొగాకు రైతులకు కేంద్రం తీపి కబురు

అందించే లక్ష్యంతో, ఒక్కో బ్యారన్‌కు రూ. 50,000 చొప్పున వడ్డీలేని రుణాన్ని ఒకే దఫాలో అందించేందుకు శుక్రవారం ఆమోదం తెలిపింది. 'వడ్డీలేని వర్కింగ్ క్యాపిటల్ సహాయ పథకం' కింద ఈ ఆర్థిక సహాయాన్ని అందిస్తున్నట్లు కేంద్ర వాణిజ్య మంత్రిత్వ శాఖ ఒక ప్రకటనలో పేర్కొంది. ఈ పథకం ద్వారా రాష్ట్రంలోని సుమారు 44,000 మంది రైతులకు ప్రయోజనం చేకూరనుంది. ఇందుకోసం కేంద్రం దాదాపు రూ. 220 కోట్లను కేటాయించింది. ఈ మొత్తాన్ని డైరెక్ట్ బెనిఫిట్ ట్రాన్స్‌ఫర్ (డీబీటీ) పద్ధతిలో నేరుగా రైతుల బ్యాంకు ఖాతాల్లోకి జమ చేయనున్నారు. ఈ తక్షణ ఆర్థిక సాయం ద్వారా రైతులు తమ కుటుంబ అవసరాలు తీర్చుకోవడంతో పాటు, సంస్థాగత రుణాలను చెల్లించడానికి, రాబోయే పంట సీజన్‌కు అవసరమైన విత్తనాలు, ఎరువులు వంటి వాటిని కొనుగోలు చేయడానికి వీలు కలుగుతుందని ప్రభుత్వం భావిస్తోంది. అదే సమయంలో ప్రైవేట్ అప్పులపై రైతులు ఆధారపడటాన్ని తగ్గించడం కూడా ఈ పథకం ముఖ్య ఉద్దేశం. ఆంధ్రప్రదేశ్‌లోని నల్ల రేగడి, దక్షిణ తేలికపాటి నేలల్లో పండించే ఎఫ్‌సీవీ పొగాకుకు అంతర్జాతీయ మార్కెట్‌లో మంచి డిమాండ్ ఉంది. తక్కువ నికోటిన్, మంచి రంగు వంటి లక్షణాల కారణంగా ఎగుమతుల్లో ఇది కీలక పాత్ర పోషిస్తుంది. రాష్ట్రంలో 2025-26 పంట సీజన్‌కు సంబంధించిన వేలం ప్రక్రియ మార్చి 25, 2026న ప్రారంభం కాగా, ఇప్పటివరకు సుమారు 100 మిలియన్ కిలోల పొగాకును వేలం వేసినట్లు మంత్రిత్వ శాఖ తెలిపింది. ప్రపంచవ్యాప్తంగా పొగాకు మార్కెట్‌లో మారుతున్న డిమాండ్, భౌగోళిక రాజకీయ పరిణామాలు, అంతర్జాతీయ వాణిజ్య పోకడల కారణంగా పంట సేకరణ, మార్కెటింగ్‌పై ప్రభావం పడుతోందని ప్రభుత్వం గుర్తించింది. ఈ నేపథ్యంలో, పంట సేకరణను సులభతరం చేయడానికి, మార్కెట్‌లో భాగస్వామ్యాన్ని పెంచడానికి, ఎగుమతులను ప్రోత్సహించడానికి సమన్వయంతో చర్యలు చేపడుతున్నట్లు కేంద్రం వెల్లడించింది. ఎగుమతిదారులు, కొనుగోలుదారులు, రైతులతో నిరంతరం చర్చిస్తూ పొగాకు రంగాన్ని బలోపేతం చేయడానికి కట్టుబడి ఉన్నామని పునరుద్ఘాటించింది.

## ఏపీలో దసరా కానుకగా 'ఆడబిడ్డ' నిధి కింద రూ.18,000?

వస్తున్న వార్తల ప్రకారం... ప్రభుత్వం ఈ ఏడాదికి సంబంధించిన మొత్తం రూ.18,000ల మొత్తాన్ని దసరా పండుగ సందర్భంగా ఒకే విడతలో లబ్ధిదారులకు అందించేందుకు కసరత్తు చేస్తోందని సమాచారం. పండుగ వేళ మహిళలకు పెద్ద ఉపశమనం కలిగించేలా ఈ నిర్ణయం తీసుకునే ఆలోచనలో ఉన్నట్లు ప్రచారం జరుగుతోంది. ఈ పథకం అమలు, లబ్ధిదారుల ఎంపిక ప్రక్రియ, దరఖాస్తు విధానం, అర్హతలకు సంబంధించిన స్పష్టమైన మార్గదర్శకాలను ప్రభుత్వం త్వరలోనే విడుదల చేసే అవకాశం ఉంది. ఈ నిబంధనలు వెలువడిన అనంతరమే నగదు జమ తేదీలపై, ఇతర వివరాలపై పూర్తి అధికారిక స్పష్టత రానుంది.

## 13 నెలల్లోనే గూగుల్..

## 17 నెలల్లో ఆర్సెలర్..

నాయుడు దార్శనికతతో, వేగవంతమైన నిర్ణయాలతో రాష్ట్రాన్ని ముందుకు నడిపిస్తున్నారని లోకేశ్ తెలిపారు. తమ ప్రభుత్వ పనితీరుకు ఫలితాలే నిదర్శనమని, 2025-26 ఆర్థిక సంవత్సరం తొలి తొమ్మిది నెలల్లో దేశానికి వచ్చిన మొత్తం పెట్టుబడుల్లో 25.3 శాతం ఏపీకే వచ్చాయని గుర్తుచేశారు. ఏపీలో 'స్పీడ్ ఆఫ్ డూయింగ్ బిజినెస్'కు అత్యంత ప్రాధాన్యత ఇస్తున్నామని, మాటలకే పరిమితం కాకుండా చేతల్లో వేగం చూపిస్తున్నామని వివరించారు. గుజరాత్‌లో డబుల్ ఇంజన్ సర్కార్ ఉంటే, ఏపీలో కేంద్రం సహకారంతో 'నాయుడు-మోదీజీ' జోడీతో డబుల్ ఇంజన్ బుల్లెట్ ట్రైన్ సర్కార్ ఉందని వ్యాఖ్యానించారు. ప్రభుత్వ వేగానికి ఉదాహరణగా గూగుల్, ఆర్సెలార్ మిట్టల్ ప్రాజెక్టులను లోకేశ్ ప్రస్తావించారు. విశాఖలో గూగుల్ ఏఐ హబ్, డేటా సెంటర్ ఏర్పాటుకు సంబంధించిన ప్రక్రియను కేవలం 13 నెలల్లో పూర్తి చేశామని తెలిపారు. అదేవిధంగా, సుమారు 12 బిలియన్ డాలర్ల పెట్టుబడితో రానున్న ఆర్సెలర్ మిట్టల్ గ్రీన్‌ఫీల్డ్ స్టీల్ ప్లాంట్‌కు సంబంధించిన భూసేకరణ, పర్యావరణ అనుమతులు, పునరావాసం వంటి క్లిష్టమైన ప్రక్రియలను కేవలం 17 నెలల్లో పూర్తి చేశామని వివరించారు. పెట్టుబడిదారుల సమస్యలను వ్యక్తిగత సమస్యగా కాకుండా, వ్యవస్థాగత సమస్యగా చూసి శాశ్వత పరిష్కారాలు చూపుతామని భరోసా ఇచ్చారు. అందుకే కొందరు తనను సరదాగా 'ఆంధ్రా డోలో-650' అని పిలుస్తారని అన్నారు. పెట్టుబడిదారులను కేవలం అనుమతుల కోసం వచ్చేవారిగా కాకుండా రాష్ట్ర అభివృద్ధిలో దీర్ఘకాలిక భాగస్వాములుగా చూస్తామని లోకేశ్ స్పష్టం చేశారు. 'స్పీడ్, స్టెబిలిటీ, సర్వీస్' అనే మూడు సూత్రాలతో ముందుకెళ్తున్నామన్నారు. రాష్ట్రంలో క్లస్టర్ ఆధారిత అభివృద్ధికి ప్రాధాన్యత ఇస్తున్నామని, ఎలక్ట్రానిక్స్, ఆటోమోటివ్, గ్రీన్ ఎనర్జీ, ఫార్మా వంటి 23 రంగాల్లో ప్రత్యేక క్లస్టర్లను అభివృద్ధి చేస్తున్నామని తెలిపారు. విశాఖ, అమరావతి, తిరుపతిలను ప్రత్యేక ఆర్థిక రీజియన్లుగా తీర్చిదిద్దుతామని, హైదరాబాద్‌ను అభివృద్ధి చేసిన అనుభవంతో అమరావతిని కూడా ఉన్నతంగా నిర్మిస్తామని చంద్రబాబు పట్టుదలతో ఉన్నారని అన్నారు.

గుజరాత్, ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాలు పోటీపడాల్సిన అవసరం లేదని, కలిసి పనిచేస్తే అద్భుతాలు సృష్టించవచ్చని అభిప్రాయపడ్డారు. ఏపీని తూర్పు భారతదేశానికి వ్యూహాత్మక గేట్‌వేగా వినియోగించుకోవాలని గుజరాత్ పారిశ్రామికవేత్తలను కోరారు. నవంబర్‌లో జరగనున్న పార్ట్‌నర్‌షిప్ సమ్మిట్‌లో పాల్గొనాలని ఆహ్వానిస్తూ, 2047 నాటికి ఏపీ ఆర్థిక వ్యవస్థను 2.4 ట్రిలియన్ డాలర్లకు చేర్చడమే తమ లక్ష్యమని పునరుద్ఘాటించారు. ఈ కార్యక్రమంలో సీఐఐ గుజరాత్ ప్రతినిధులు, ఏపీఐఐసీ ఉన్నతాధికారులు, పలువురు పారిశ్రామికవేత్తలు పాల్గొన్నారు.

## ప్రస్తుత నియామక చట్టాన్ని సవరించాలి

నియామకం కోసం ఉద్దేశించిన 'చీఫ్ ఎలక్షన్ కమిషనర్ అండ్ అదర్ ఎలక్షన్ కమిషనర్స్ యాక్ట్, 2023'ను పునఃసమీక్షించి, సవరించాలని ఆయన కేంద్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఇటీవల జాతీయ మీడియాలో వచ్చిన కథనాలను జగన్ తన పోస్టులో ప్రస్తావించారు. ఎన్నికల సంఘం తీసుకున్న పలు నిర్ణయాలు, ఓటర్ల జాబితాల రూపకల్పన, ఈసీఐనెట్ నిర్వహణ వంటి అంశాలపై ఇద్దరు ఎన్నికల కమిషనర్లు అభ్యంతరాలు వ్యక్తం చేశారన్న వార్తలు ప్రజల్లో తీవ్రమైన ప్రశ్నలు, సందేహాలకు తావిస్తున్నాయని పేర్కొన్నారు. ఆరోపణలు, ప్రత్యారోపణల కంటే.. ఏయే అంశాలపై అభ్యంతరాలు నమోదయ్యాయి, వాటిపై ఎలాంటి చర్యలు తీసుకున్నారు, ఓటర్ల జాబితాలో పేర్ల చేర్పులు, తొలగింపులు, పునరుద్ధరణ ప్రక్రియ ఎంత పారదర్శకంగా జరిగిందనే దానిపై ప్రజలకు స్పష్టత అవసరమని జగన్ నొక్కిచెప్పారు. ఈ విషయాలపై ప్రజలకు నమ్మకం కలిగించే చర్యలు తక్షణమే చేపట్టాలని సూచించారు. ఈ నేపథ్యంలో, గతంలో తాము కూడా మద్దతు ఇచ్చిన 2023 నాటి ఎన్నికల కమిషనర్ల నియామక చట్టాన్ని ప్రస్తుత పరిస్థితుల దృష్ట్యా పునఃసమీక్షించాల్సిన అవసరం ఉందని జగన్ పేర్కొన్నారు. ఈ భయాలను తొలగించి, సాధారణ పరిస్థితులను నెలకొల్పేందుకు కేంద్ర ప్రభుత్వమే ముందుకు రావాలని కోరారు. ప్రధానమంత్రి, లోక్‌సభలో ప్రతిపక్ష నేత, భారత ప్రధాన న్యాయమూర్తి (సీజేఐ)లతో కూడిన త్రిసభ్య కమిటీ ద్వారానే ఎన్నికల కమిషనర్లను నియమించే పాత విధానాన్ని పునరుద్ధరించాలని డిమాండ్ చేశారు. "పరీక్ష రాసే విద్యార్థి, తన ఎగ్జామినర్ ను నియమించుకుంటే, ఆ అధికారి ఎంత నిజాయతీపరుడైనా ఆరోపణలకు ఆస్కారం ఉంటుంది. ఆ స్థానంలో ఒక తటస్థ వ్యక్తి ఉంటేనే మేలు" అని జగన్ ఉదహరించారు. ఈ మార్పు ఎన్నికల సంఘంపై ప్రజల గౌరవాన్ని, విశ్వాసాన్ని కచ్చితంగా పునరుద్ధరిస్తుందని ఆయన అభిప్రాయపడ్డారు. ఆంధ్రప్రదేశ్‌లో తమ పార్టీ ఎదుర్కొన్న అనుభవాలను కూడా జగన్ ఈ సందర్భంగా గుర్తుచేశారు. ఏపీలో ఎస్ఐఆర్ (ా×=) ప్రక్రియ సమయంలో అధికార పార్టీ తన అధికారాన్ని దుర్వినియోగం చేసిందని, అనేక సందర్భాల్లో తమ విజ్ఞప్తులను పట్టించుకోలేదని ఆరోపించారు. స్థానిక సంస్థల ఎన్నికల ప్రక్రియలోనూ డివిజన్ల పునర్విభజన తీరుపై ప్రతిపక్షంగా తాము లేవనెత్తిన అభ్యంతరాలను పక్కన పెట్టేశారని అన్నారు. ఇలాంటి చర్యలు ఎన్నికల ప్రక్రియపై ప్రజా విశ్వాసాన్ని బలహీనపరుస్తాయని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. ప్రజాస్వామ్యంలో పారదర్శకత, జవాబుదారీతనం ఉండటమే కాదు, అవి ఉన్నట్టుగా కనిపించాలని, వాటిని కాపాడటమే రాజ్యాంగ సంస్థల ప్రాథమిక విధి అని జగన్ తన పోస్టులో స్పష్టం చేశారు.

## హైదరాబాద్‌లో మన్మోహన్ సింగ్ విగ్రహం.

నిర్మాణంలో మన్మోహన్ సింగ్ పోషించిన పాత్ర, ఆయన ఆర్థిక దార్శనికత, నిస్వార్థ ప్రజాసేవ, నిరాడంబర నాయకత్వ లక్షణాలను భవిష్యత్ తరాలకు గుర్తుచేసే ఒక శాశ్వత ప్రతీక అని ఆయన అభివర్ణించారు. మన్మోహన్ సింగ్ పేరు భారత చరిత్రలో చిరస్థాయిగా నిలిచిపోతుందని పొన్నం కొనియాడారు. 1991లో ఆర్థిక మంత్రిగా ఆయన ప్రారంభించిన సంస్కరణలు భారత ఆర్థిక వ్యవస్థలో కీలక మార్పులకు బాటలు వేశాయని గుర్తుచేశారు. 2004 నుంచి 2014 వరకు ప్రధానమంత్రిగా దేశాభివృద్ధి, ప్రజా సంక్షేమం, ఆర్థిక స్థిరత్వం కోసం ఆయన చేసిన సేవలు మరువలేనివని అన్నారు. ఆయన హయాంలోనే మహాత్మా గాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం, సమాచార హక్కు చట్టం, విద్యా హక్కు చట్టం వంటివి అమల్లోకి వచ్చాయని తెలిపారు. తెలంగాణ ప్రజల దశాబ్దాల ఆకాంక్ష అయిన ప్రత్యేక రాష్ట్ర ఏర్పాటు ప్రక్రియలో మన్మోహన్ సింగ్ కీలక పాత్ర పోషించారని మంత్రి పొన్నం ప్రభాకర్ స్పష్టం చేశారు. 2009లో ప్రక్రియ ప్రారంభించాలని నాటి యూపీఏ ప్రభుత్వం నిర్ణయం తీసుకోవడం నుంచి 2014లో ఆంధ్రప్రదేశ్ పునర్వ్యవస్థీకరణ చట్టం ద్వారా తెలంగాణ రాష్ట్రం ఏర్పడే వరకు కేంద్రంలో మన్మోహన్ సింగ్ నేతృత్వంలోని ప్రభుత్వం చారిత్రాత్మక పాత్ర పోషించిందని ఆయన వివరించారు. రాష్ట్ర ఏర్పాటులో యూపీఏ ప్రభుత్వం, మన్మోహన్ సింగ్ పాత్రను తెలంగాణ ప్రభుత్వం అధికారికంగా గుర్తించిందని ఆయన తెలిపారు. ప్రధానిగా మన్మోహన్ సింగ్ మార్గదర్శకత్వంలో ఎంపీగా పనిచేయడం తన రాజకీయ జీవితంలో గర్వకారణమని పొన్నం ప్రభాకర్ పేర్కొన్నారు.

## యూపీఐ లావాదేవీలపై చార్జీలు.. వినియోగదారులకు భారం లేదు

లోపం వల్లే అనవసర అపోహలు వ్యాపిస్తున్నాయని అన్నారు. ఇప్పటికే డెబిట్, క్రెడిట్ కార్డుల ద్వారా జరిగే చెల్లింపుల్లో వ్యాపారులు ఇలాంటి రుసుములను భరిస్తున్నారని గుర్తుచేశారు. యూపీఐ చెల్లింపుల విషయంలోనూ ఈ చార్జీని కస్టమర్లపైకి నెట్టే అవకాశం ఉండదని మంత్రి తేల్చిచెప్పారు. డిజిటల్ చెల్లింపులను ఉపయోగించే ప్రజలకు సేవలు ఉచితంగానే, ఎప్పటిలాగే అంతరాయం లేకుండా అందుబాటులో ఉంటాయని తెలిపారు. తప్పుడు ప్రచారాలను నమ్మి ప్రజలు గందరగోళానికి గురికావొద్దని సూచించిన ఆమె, ఎండీఆర్ ద్వారా వసూలయ్యే సొమ్ము డిజిటల్ పేమెంట్ నెట్‌వర్క్ నిర్వహణలో భాగస్వామ్యమైన బ్యాంకులు, చెల్లింపు సేవల సంస్థల వ్యవస్థాపక వ్యయాలకే ఉపయోగపడుతుందని వివరించారు.

## గంగమ్మ ఒడికి ఖైరతాబాద్ మహాగణపతి...

అందరిలో ఉత్సాహాన్ని నింపారు. 'గణపతి బప్పా మోరియా' అంటూ భక్తులు చేసిన నినాదాలతో పరిసర ప్రాంతాలన్నీ మార్మోగాయి. ఈ శోభాయాత్ర సెన్సేషన్ థియేటర్, రాజ్‌దూత్ చౌరస్తా, టెలిఫోన్ భవన్, ఇక్బాల్ మినార్, తెలంగాణ తల్లి చౌరస్తా మీదుగా ఎన్టీఆర్ మార్గ్‌కు చేరుకుంది. ఎన్టీఆర్ మార్గ్‌లో ఏర్పాటు చేసిన క్రేన్ నంబర్ 4 వద్దకు విగ్రహాన్ని చేర్చిన అనంతరం, ఉత్సవ కమిటీ సభ్యులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. మధ్యాహ్నం 2.15 గంటలకు భారీ క్రేన్ల సహాయంతో విగ్రహాన్ని సాగరంలో నిమజ్జనం చేశారు. తమ ఆరాధ్య దైవమైన గణనాథుడికి భక్తులు అశ్రునయనాలతో ఘనంగా వీడ్కోలు పలికారు. పోలీసు యంత్రాంగం పటిష్ఠ బందోబస్తు ఏర్పాటు చేయడంతో ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు చోటు చేసుకోకుండా నిమజ్జన ప్రక్రియ విజయవంతంగా పూర్తయింది.

## జనసేనలో చేరిన యనమల కృష్ణుడు, నవీన్ నిశ్చల్

వైసీపీ నేతలతో పాటు, కాంగ్రెస్ నాయకురాలు ఒకరు శుక్రవారం జనసేన అధినేత, ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ సమక్షంలో పార్టీలో చేరారు. తుని నియోజకవర్గానికి చెందిన వైసీపీ నేత యనమల కృష్ణుడు, హిందూపురం సీనియర్ నాయకుడు నవీన్ నిశ్చల్ వంటి ప్రముఖులు జనసేన తీర్థం పుచ్చుకున్నారు. మంగళగిరిలోని పార్టీ కార్యాలయంలో జరిగిన ఈ కార్యక్రమంలో పవన్ కల్యాణ్ వీరికి పార్టీ కండువాలు కప్పి సాదరంగా ఆహ్వానించారు. జనసేన పార్టీ సిద్ధాంతాలు, ముఖ్యంగా ఉప ముఖ్యమంత్రిగా పవన్ కల్యాణ్ పరిపాలనలో చూపుతున్న నిబద్ధత, చేపడుతున్న సంస్కరణలకు ఆకర్షితులై పార్టీలో చేరుతున్నట్లు ఈ సందర్భంగా నేతలు తెలిపారు. వీరితో పాటు ఏలూరు డీసీసీబీ మాజీ ఛైర్మన్ పీవీఎల్ఎన్ నరసింహరాజు, కందుకూరు, సర్వేపల్లి, కనిగిరి నియోజకవర్గాల వైసీపీ పరిశీలకుడు మన్నెమాల సుకుమార్ రెడ్డి, కాంగ్రెస్ నాయకురాలు అయితాబత్తుల సుభాషిణి కూడా జనసేనలో చేరారు. తునికి చెందిన పోలినాటి శేషగిరిరావు, తణుకు నుంచి దిరిశాల కృష్ణ శ్రీనివాస్, శ్రీకాళహస్తికి చెందిన సత్రవాడ ప్రవీణ్, మిద్దెల హరి, ముమ్మిడివరం మాజీ ఏఎంసీ ఛైర్మన్ కుడిపూడి శివన్నారాయణ, నరసరావుపేటకు చెందిన ఏలూరి ప్రసాద్ తదితరులు పవన్ కల్యాణ్ చేతుల మీదుగా పార్టీ కండువా కప్పుకున్నారు. ఈ సందర్భంగా కొత్తగా చేరిన నాయకులను ఉద్దేశించి పవన్ కల్యాణ్ మాట్లాడుతూ.. పార్టీ సిద్ధాంతాలను ప్రజల్లోకి బలంగా తీసుకెళ్లాలని సూచించారు. అందరినీ కలుపుకొని, సమష్టిగా పనిచేస్తూ పార్టీ ఉన్నతికి కృషి చేయాలని వారికి దిశానిర్దేశం చేశారు. రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం ఏర్పడిన తర్వాత జనసేనలో చేరికలు ఊపందుకోవడం రాజకీయ వర్గాల్లో ఆసక్తిని రేకెత్తిస్తోంది.

## బ్యాంకుల సమ్మె ఎఫెక్ట్.. ఏపీలో మారిన పింఛన్ల పంపిణీ షెడ్యూల్

ఇందుకు ప్రధాన కారణంగా తెలుస్తోంది. సెప్టెంబర్ 26న బ్యాంకులకు సెలవు కాగా, 28, 29, 30 తేదీల్లో బ్యాంకు ఉద్యోగులు సమ్మెకు పిలుపునిచ్చారు. ఈ నేపథ్యంలో అక్టోబర్ 1వ తేదీ ఉదయం స్వర్ణ గ్రామ, వార్డు సచివాలయ ఉద్యోగులు బ్యాంకులకు వెళ్లి పింఛన్లకు అవసరమైన నగదును విత్‌డ్రా చేస్తారు. అనంతరం మధ్యాహ్నం నుంచి లబ్ధిదారుల ఇళ్ల వద్దకే వెళ్లి పింఛన్ డబ్బులను పంపిణీ చేయనున్నారు. అక్టోబర్ నెలకు గాను రాష్ట్రవ్యాప్తంగా 61.80 లక్షల మంది పింఛన్ లబ్ధిదారుల కోసం ప్రభుత్వం ఇప్పటికే రూ.2,692 కోట్లను విడుదల చేసింది. లబ్ధిదారులకు ఎలాంటి ఇబ్బంది లేకుండా ముందుగానే అన్ని ఏర్పాట్లు చేసుకోవాలని మంత్రి అధికారులకు సూచించారు. ఇదిలా ఉంటే.. జాతీయ సామాజిక సహాయ కార్యక్రమం (ఎన్ఎస్ఏపీ) కింద కేంద్రం ఇచ్చే నిధులను నేరుగా లబ్ధిదారుల బ్యాంకు ఖాతాల్లో జమ చేసే విధానాన్ని ప్రయోగాత్మకంగా అమలు చేయాలని ప్రభుత్వం నిర్ణయించింది. ఈ పైలట్ ప్రాజెక్టును తొలుత విజయనగరం జిల్లా గజపతినగరం మండలంలో ప్రారంభించనున్నారు. రాష్ట్రంలో మొత్తం 9.34 లక్షల మంది లబ్ధిదారులు ఈ పథకంతో అనుసంధానమై ఉన్నారు.

## దీన్‌దయాళ్ ఆలోచనలే వికసిత్ భారత్‌కు దిక్సూచి ప్రధాని మోదీ

ఢిల్లీలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో మోదీ పాల్గొన్నారు. ఈ సందర్భంగా మోదీ మాట్లాడుతూ ఆయన ఈ వ్యాఖ్యలు చేశారు. అభివృద్ధి ఫలాలు సమాజంలోని చివరి వ్యక్తి వరకు చేరడమే అంత్యోదయ లక్ష్యమని మోదీ గుర్తుచేశారు. ఏకాత్మ మానవతావాదాన్ని వివరిస్తూ, వ్యక్తి ఎదుగుదలతో పాటు సమాజం, ప్రకృతి, దేశం మధ్య సమతుల్యత ఉండాలని దీన్‌దయాళ్ ఉపాధ్యాయ ప్రతిపాదించారని ప్రధాని పేర్కొన్నారు. కేవలం ఆర్థిక వృద్ధే అభివృద్ధి కాదని, అందులో సామాజిక సంక్షేమం, పర్యావరణ పరిరక్షణ కూడా భాగస్వామ్యం కావాలని ఆయన భావించినట్లు తెలిపారు. పేదల సంక్షేమం, సమాజంలోని అట్టడుగు వర్గాల సాధికారత, పర్యావరణ సమతుల్యతకు ప్రాధాన్యమిస్తూ తమ ప్రభుత్వం నిర్ణయాలు తీసుకుంటోందని మోదీ వివరించారు. ఈ ఆలోచనల స్ఫూర్తితోనే సమగ్ర, అభివృద్ధి చెందిన భారతదేశం లక్ష్యంగా 'వికసిత్ భారత్' నిర్మాణాన్ని ముందుకు తీసుకెళ్తున్నామని అన్నారు.

## నవంబర్ 1 నుంచి ఖరీఫ్ ధాన్యం కొనుగోళ్లు..

రవాణా ఖర్చులు కూడా చెల్లించేలా ప్రభుత్వం ప్రణాళిక రూపొందించినట్లు చెప్పారు. ఎల్‌నినో ప్రభావం కారణంగా పంట దిగుబడులు, తద్వారా ధాన్యం సేకరణ అంచనాలు తగ్గినట్లు నాదెండ్ల మనోహర్ పేర్కొన్నారు. అయినప్పటికీ, రైతుల వద్ద ధాన్యం నిల్వ ఉండకుండా సకాలంలో కొనుగోలు చేయడానికి అధికారులు సమన్వయంతో పనిచేయాలని సూచించారు. కొనుగోలు కేంద్రాల నిర్వహణ, రవాణా, గోనె సంచుల సరఫరా, మిల్లుల సామర్థ్యం, చెల్లింపుల ప్రక్రియ వంటి అంశాల్లో పౌరసరఫరాల శాఖతో పాటు ఇతర ప్రభుత్వ విభాగాలను భాగస్వామ్యం చేసేందుకే ఈ వర్క్‌షాప్ నిర్వహించినట్లు తెలిపారు. రైతుల నుంచి ధాన్యం సేకరించిన తర్వాత చెల్లింపులు ఆలస్యం కాకుండా ముందస్తు కార్యాచరణ అమలు చేయాలని చెప్పారు.

## కోర్టు తుది తీర్పు వచ్చిన వెంటనే ఎన్నికలకు చర్యలు

మున్సిపల్ ఎన్నికలు నిర్వహించడానికి ప్రభుత్వం సిద్ధంగా ఉందని మంత్రి స్పష్టం చేశారు.

**వార్డుల విభజన, రిజర్వేషన్లపై కసరత్తు!**

మున్సిపాలిటీలు మరియు నగరపాలక సంస్థల పదవీకాలం ముగియడంతో ప్రస్తుతం అక్కడ అధికారుల పాలన కొనసాగుతోంది. అయితే, ప్రభుత్వం ఎన్నికల నిర్వహణకు సంబంధించి ఇప్పటికే వార్డుల పునర్విభజన, బిసి రిజర్వేషన్ల ప్రక్రియలపై అంతర్గత కసరత్తు పూర్తి చేస్తోంది. న్యాయస్థానాల నుంచి తుది ఉత్తర్వులు వెలువడగానే రాష్ట్ర ఎన్నికల సంఘంతో (SEC) సమన్వయం చేసుకుంటూ ఎన్నికల షెడ్యూల్ విడుదలకు చర్యలు తీసుకుంటామని మంత్రి వెల్లడించారు. ఈ ప్రకటనతో మున్సిపల్ పోరు కోసం ఎదురుచూస్తున్న రాజకీయ వర్గాలు మరియు అభ్యర్థులకు స్పష్టత వచ్చినట్లయింది.

# అంగన్వాడీ ఉత్సవాలు



**ముమ్మిడివరం సెప్టెంబర్ 25 (తెలుగు రాష్ట్రం విలేఖరి)**

ఈ రోజు నుండి ముమ్మిడివరం నగర పంచాయతీ పరిధిలో బొక్కా వారి పేట, మల్లయ్య పాలెం లో అంగన్వాడి ఉత్సవాలు సి డి పి ఓ మేడం ఎం నిహారిక ఆధ్వర్యంలో ఈ కార్యక్రమం జరిగింది, ఈ కార్యక్రమం సెప్టెంబర్ 25 వ తేది నుంచి, అక్టోబర్ 7 వ తేది వరకు ముమ్మిడివరం ×జణా ప్రాజెక్ట్ లోని అన్ని అంగన్వాడీ కేంద్రాలలో అంగన్వాడీ ఉత్సవాలు మన గౌరవ ప్రధాన మంత్రి నరేంద్ర మోడీ ఏర్పాటు చేశారు ఈ కార్యక్రమంలో రాజకీయ నాయకులు, అంగన్వాడీ లబ్ధిదారులు గ్రామ ప్రజలు హాజరయ్యేలా చూడాలి, మన ప్రభుత్వం పెట్టిన పధకాలు, అంగన్వాడీ లో జరుగు సేవలు, ప్రీ స్కూల్ కార్యక్రమాలు మీద అవగాహన కలగాచెయ్యాలి ఈ రోజు బొక్కవారి పేట, మల్లయ్య పాలెం సీడీపీఓ మేడం , అంగన్వాడీ ఆర్గనైజషన్ సెక్రటరీ మెండి కమల , బొక్క రుక్మిణి, ఐసిడిఎస్ సూపర్వైజర్ సిహెచ్ పల్లవి, బొక్కవారి పేట వార్డు ఇంచార్జి, తల్లులు కిశోరి బాలికలు హాజరైయి నారు.

# నీట మునిగిన పల్లపు ప్రాంతాలు



**ముమ్మిడివరం సెప్టెంబర్ 25 (తెలుగు రాష్ట్రం విలేఖరి)**

ముమ్మిడివరం మండలంలో ఎడతెరిపి లేకుండా కురిసిన వర్షాల కారణంగా పలు పల్లపు ప్రాంతాలు నీట మునిగాయి. కాశివారితూము సమీపంలో గల నివాస గృహాల చుట్టూ వర్షపు నీరు చేరింది. నేరు దిగే వీలు లేకపోవడంతో చెరువును తలపిస్తుంది. నీటిలోనే రాకపోకల కొనసాగిస్తున్నామని, పాములు, దోమలు బెడద ఎక్కువగా ఉందని వృద్ధులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. సంబంధిత అధికారులు స్పందించి నీరు దిగే విధంగా చర్యలు చేపట్టాలని కోరుకుంటున్నారు.

## సేవా సంకల్ప కార్యక్రమంలో భాగంగా

# ప్రభుత్వ ఆసుపత్రిలో మెడికల్ క్యాంప్

### క్యాంప్‌ను ప్రారంభించిన ఎమ్మెల్యే గిడ్డి సత్యనారాయణ



**పి.గన్నవరం (తెలుగు రాష్ట్రం విలేఖరి )**




పి.గన్నవరం : ప్రధానమంత్రి నరేంద్ర మోదీ 15 ఏళ్ల ప్రజాసేవను పురస్కరించుకుని సెప్టెంబర్ 17 నుంచి అక్టోబర్ 17, 2026 వరకు నిర్వహిస్తున్న సేవా సంకల్ప కార్యక్రమంలో భాగంగా ప్రభుత్వ ఆసుపత్రిలో ఏర్పాటు చేసిన మెడికల్ క్యాంప్‌ను పి.గన్నవరం ఎమ్మెల్యే గిడ్డి సత్యనారాయణ ప్రారంభించారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ, ఆసుపత్రికి వచ్చే రోగుల సమస్యలను సానుభూతితో తెలుసుకుని మెరుగైన వైద్య సేవలు అందించాలని వైద్యులు, సిబ్బందికి సూచించారు. రోగుల పట్ల నిర్లక్ష్యాన్ని సహించబోమని స్పష్టం చేశారు. ఆసుపత్రి అభివృద్ధికి తన సహకారం అందిస్తానని తెలిపారు.ఏప్రిల్ నుంచి జూన్ వరకు 378 ఆపరేషన్లు నిర్వహించిన ఆసుపత్రి సూపరింటెండెంట్, వైద్య సిబ్బందిని ఎమ్మెల్యే అభినందించారు. ఆసుపత్రికి అవసరమైన మౌలిక సదుపాయాలను సీఎస్ఆర్ నిధులతో త్వరలో సమకూర్చేందుకు కృషి చేస్తానని హామీ ఇచ్చారు.ప్రజలు ఆరోగ్యంపై శ్రద్ధ వహించాలని, ప్రజాసేవా భావంతో పనిచేయడం అందరికీ స్ఫూర్తిదాయకమని ఎమ్మెల్యే పేర్కొన్నారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ప్రజా సంక్షేమం, అభివృద్ధి లక్ష్యంగా సమన్వయంతో పనిచేస్తున్నాయని తెలిపారు.

# వరద ముంపు ప్రాంతాలలో పటిష్టమైన చర్యలు తీసుకోవాలి : జె సి

## సంబంధిత శాఖ అధికారులకు దిశా నిర్దేశం



**అమలాపురం సెప్టెంబర్ 25 తెలుగు రాష్ట్రం న్యూస్**

అమలాపురం కలెక్టరేట్ నుంచి జాయింట్ కలెక్టర్ నైడియా దేవి.. జిల్లా స్థాయి వివిధ శాఖల అధికారులతో కలిసి అన్ని మండలాల తహశీల్దార్లు , ఎంపీడీవోలు ఇతర అధికారులతో వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సమీక్ష నిర్వహించారు. తుఫాను ప్రభావిత ప్రాంతాలు, వరద ముంపునకు గురయ్యే మండలాల్లో ప్రస్తుత పరిస్థితిని ఆయా మండలాల అధికారులతో మాట్లాడి వివరాల ఆరా తీశారు. వరద ముంపుకు లోనయ్యే లోతట్టు ప్రాంతాల్లోని ప్రజలను సురక్షిత ప్రాంతాలకు తరలించడం, తుఫాను పునరావాస కేంద్రాలు ఏర్పాటు, వైద్య శిబిరాలు నిర్వహణ, తాగునీరు, విద్యుత్ సదుపాయాలకు అంతరాయం లేకుండా చూడడం వంటి అంశాలపై ఈ సందర్భంగా జేసీ.. క్షేత్రస్థాయి సిబ్బందికి దిశా నిర్దేశనం చేశారు. ఈ సందర్భంగా జేసీ నైడియా దేవి మాట్లాడుతూ.. లోతట్టు ప్రాంతాల ప్రజలను అప్రమత్తం చేసి సురక్షిత ప్రాంతాలకు తరలించాలన్నారు. వర్షాలు తగ్గినప్పటికీ వరద ముంపు పొంచి ఉన్న నేపథ్యంలో వరద ముంపును సమర్థవంతంగా ఎదుర్కొనేందుకు జిల్లా అధికారయంత్రాంగం పూర్తి సన్నద్ధతో ఉండాలని జేసీ స్పష్టం చేశారు. ఎలాంటి ఆస్తి, ప్రాణ నష్టం వాటిల్లకుండా అవసరమైన సహాయక చర్యలు తీసుకోవాలని జేసీ తెలిపారు. మొదటి, రెండవ హెచ్చరిక స్థాయిల వద్ద ఏయే గ్రామాలు ముంపునకు గురవుతాయో ముందస్తుగా గుర్తించి తగిన జాగ్రత్తలు తీసుకోవాలని జేసీ అధికారులను ఆదేశించారు. లోతట్టు ప్రాంతాల ప్రజలను సురక్షిత ప్రాంతాలకు తరలించే ప్రక్రియను వేగవంతం చేయాలని తెలిపారు. ముంపు బాధితుల కోసం ఏర్పాటు చేసే పునరావాస కేంద్రాల్లో తాగునీరు, విద్యుత్ సరఫరా వంటి సదుపాయాలు, వైద్య శిబిరాలను ఏర్పాటు చేసి మెరుగైన వైద్య సేవలు అందించేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. అత్యవసర సేవల్లో భాగంగా గర్భిణీ స్త్రీలు, బాలింతలు, వృద్ధులను ముందుగానే గుర్తించి, ఎలాంటి ప్రమాదం జరగకుండా ముందుగానే సురక్షిత ప్రాంతాల తరలించాలన్నారు. లంక గ్రామాల్లో నివాసముండే ప్రజలతోపాటు పశువులను కూడా సురక్షత ప్రాంతాలకు తరలించాలని స్పష్టం చేశారు. వరద సమయంలో పశువులకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా తగిన దాణా, పశు వైద్య వసతులు కల్పించేలా ప్రత్యేక శ్రద్ధ వహించాలని జేసీ అధికారులకు సూచించారు. వీడియో కాన్ఫరెన్స్ లో జిల్లా రెవెన్యూ అధికారి వి.సుబ్బారావు, కలెక్టరేట్ పరిపాలన అధికారి కె. నాగలక్ష్మమ్మ, వైద్య ఆరోగ్యం, మత్స్య, పంచాయతీ, విద్యా ఇరిగేషన్, డ్రైయిన్స్ వంటి ఇతర శాఖల జిల్లా స్థాయి అధికారులు, అన్ని మండలాల తహశీల్దార్లు, ఎంపీడీవోలు, తదితరులు పాల్గొన్నారు.



# అమలాపురంలో ‘5కే రెడ్ రన్’ మారథన్

## కలెక్టర్ డా. ఆర్. మహేష్ కుమారర్

**అమలాపురం సెప్టెంబర్ 25, తెలుగు రాష్ట్రం న్యూస్**

సెప్టెంబర్ 26వ తేదీన యువత, ప్రజల్లో హెచ్ఐవీ/ఎయిడ్స్, లైంగిక సంక్రమిత వ్యాధులపై సమగ్ర అవగాహన కల్పించేందుకు జిల్లా కేంద్రమైన అమలాపురంలో ‘5కే రెడ్ రన్’ మారథాన్ నిర్వహించనున్నట్లు జిల్లా కలెక్టర్, జిల్లా మేజిస్ట్రేట్ డా. ఆర్. మహేష్ కుమార్, ఒక ప్రకటనలో తెలిపారు. ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ఎయిడ్స్ నియంత్రణ సంస్థ, తాడేపల్లి, జిల్లా కలెక్టర్ ఆదేశాల మేరకు డిస్ట్రిక్ట్ ఇంటిగ్రేటెడ్ స్ట్రాటజీ ఫర్ హెచ్ఐవీ/ఎయిడ్స్ (దిశ), జిల్లా స్పోర్ట్స్ అథారిటీ సంయుక్త ఆధ్వర్యంలో ఈ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు. ఈ మారథాన్ సెప్టెంబర్ 26వ తేదీ ఉదయం 6 గంటలకు భట్నవిల్లి హైవే వద్ద ప్రారంభమై 5 కిలోమీటర్ల మేర కొనసాగుతుందని తెలిపారు. డా. బి.ఆర్. అంబేద్కర్ కోనసీమ జిల్లాలోని



ప్రభుత్వ, ప్రైవేటు కళాశాలల్లో చదువుతున్న 17 నుంచి 25 సంవత్సరాల వయస్సు గల విద్యార్థినీ విద్యార్థులు, యువతీ యువకులు ఈ పోటీల్లో పాల్గొనవచ్చని వెల్లడించారు.

**విజేతలకు నగదు బహుమతులు**

5కే రెడ్ రన్‌లో మహిళలు, పురుషులకు వేర్వేరుగా పోటీలు నిర్వహించి, విజేతలకు నగదు బహుమతులు అందజేయనున్నట్లు కలెక్టర్ తెలిపారు. జిల్లా స్థాయిలో ప్రథమ బహుమతిగా రూ.10,000, ద్వితీయ బహుమతిగా రూ.7,000 అందజేస్తారని పేర్కొన్నారు. జిల్లా స్థాయి పోటీల్లో విజేతలుగా నిలిచిన వారిని విజయవాడలో నిర్వహించే రాష్ట్రస్థాయి ‘5కే రెడ్ రన్’ పోటీలకు ఎంపిక చేస్తారని తెలిపారు.

**వివరాలకు సంప్రదించాల్సిన నంబర్లు**

ఈ మారథాన్‌లో పాల్గొనడానికి ఆసక్తి ఉన్న విద్యార్థులు, యువత పూర్తి వివరాల కోసం జిల్లా అధికారులు ఎ. బుజ్జిబాబు (9000397803), జి. కవిత (9581322538)లను సంప్రదించాలని కలెక్టర్ ప్రకటనలో విజ్ఞప్తి చేశారు.

## ముమ్మిడివరం మండల పరిషత్ అధ్యక్షురాలిగా

# పదవి కాలం పూర్తి చేసుకున్న కోలా గంగాభవాని బాబ్జి

**ముమ్మిడివరం సెప్టెంబర్ 25 (తెలుగు రాష్ట్రం విలేఖరి)**

ముమ్మిడివరం మండల పరిషత్ అధ్యక్షురాలిగా పదవి కాలం పూర్తి చేసుకున్న కోలా గంగాభవాని బాబ్జి గారిని ఈ రోజున గేదెలంక గ్రామంలో ఆమె స్వగృహంలో వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ నాయకులు శాలువాతో సత్కరించి ఆమె పదవి కాలంలో చేసిన అభివృద్ధిని కొనియాడుతూ అభినందించారు.. ఈ కార్యక్రమంలో కోలా బాబ్జి,స్టేట్ ..లీగల్ సెల్ .. సెక్రటరీ .కోన వెంకట శ్రీనివాస రావు .. ముమ్మిడివరం పట్టణ అధ్యక్షులు బొంతు సత్య శ్రీనివాస్, వైస్ ఎంపీపీ మట్టపర్తి సురేష్, వైయస్సార్సీపి అనుబంధ విభాగాల కార్యదర్శులు నాట్రా వీర్రాజు, ఎం అలీ హసన్, కోరసిక సత్తిబాబు, జంగారెడ్డి రమేష్ మొదలగు వారు పాల్గొన్నారు..



# తుపాను ప్రభావిత వరిచేలు పరిశీలన



**ముమ్మిడివరం సెప్టెంబర్ 25 (తెలుగు రాష్ట్రం విలేఖరి)**

కాట్రేనికోన మండలం గెద్దనపల్లిలో తుపాన్ ప్రభావిత ప్రాంతాల్లో వరి చేలును పరిశీలించి రైతులతో మాట్లాడిన ప్రభుత్వ విప్ మరియు ముమ్మిడివరం నియోజకవర్గ శాసనసభ్యులు శ్రీ దాట్ల బుచ్చిబాబు , డాక్టర్ బి. ఆర్ అంబేద్కర్ కోనసీమ జిల్లా తెలుగుదేశం పార్టీ అధ్యక్షులు గుత్తుల సాయి. ఈ కార్యక్రమంలో కాట్రేనికోన మాజీ జడ్పీటీసీ నాగిడి నాగేశ్వరరావు, నియోజకవర్గ సీనియర్ నాయకులు నడింపల్లి సుబ్బరాజు, జిల్లా తెలుగుదేశం పార్టీ ఉపాధ్యక్షులు తాడి నరసింహారావు,ముమ్మిడివరం నియోజకవర్గ రైతు విభాగం అధ్యక్షులు యాళ్ల ఉదయ్ మరియు చీణూ కూటమి నాయకులు, కార్యకర్తలు తదితరులు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు.

# పండిట్ దీన్ దయాల్ ఉపాధ్యాయ జయంతి

**ముమ్మిడివరం సెప్టెంబర్ 25 (తెలుగు రాష్ట్రం విలేఖరి)**



కాట్రేనికోన మండలం చెయ్యేరు గ్రామంలో పండిట్ దీన్ దయాల్ ఉపాధ్యాయ జయంతి సందర్భంగా మండల అధ్యక్షులు మట్ట శివకుమార్ ఆధ్వర్యంలో రాష్ట్ర అధికార ప్రతినిధి శ్రీ నల్ల పవన్ కుమార్ పండిట్ దీన్ దయాల్ ఉపాధ్యాయ చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళిఅర్పించారు ఈ కార్యక్రమంలో పవన్ కుమార్ గారు మాట్లాడుతూ ఆయన ఆశయాలు సమాజంలోని అన్ని వర్గాల అభ్యుదయానికి ఆయన చేసిన ఎన్నో మంచి పనులకి మరువ లేనిది అని స్మరించుకున్నారు ఈ కార్యక్రమంలో ఆక్వా కల్చర్ ద్వాక్రాకుండా గంగన్న స్వామి మట్ట సూరిబాబు సుంకర నాగేశ్వరరావు నంద్యాల బుచ్చిరామ్మూర్తి కొత్తలంక సురేష్ పాల్గొనడం జరిగింది

# వరిచేలు పరిశీలన

**ముమ్మిడివరం సెప్టెంబర్ 25 (తెలుగు రాష్ట్రం విలేఖరి)**



డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ కోనసీమ జిల్లా పి.గన్నవరం నియోజకవర్గం మామిడికుదురు మండలం పాశర్లపూడిలో తుపాన్ ప్రభావిత ప్రాంతాల్లో వరి చేలును పరిశిలించి, రైతులతో మాట్లాడిన డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ కోనసీమ జిల్లా తెలుగుదేశం పార్టీ అధ్యక్షులు గుత్తుల సాయి , జిల్లా ప్రధాన కార్యదర్శి గంధం పల్లంరాజు. ఈ కార్యక్రమంలో పి.గన్నవరం నియోజకవర్గం కో కన్వినర్స్ మోకా ఆనందసాగర్, దాసరి వీర వెంకట సత్యనారాయణ, మామిడికుదురు మండలం టిడిపి అధ్యక్షులు బోనం బాబు, జిల్లా టిడిపి ఉపాధ్యక్షులు మొల్లేటి శ్రీనివాస్, రాష్ట్ర కార్పొరేషన్ డైరెక్టర్స్ సుధా బాబ్జి, మట్టపరి బాల బారతి,చెల్లుబోయిన గంగాదేవి, టిడిపి జిల్లా సెక్రటరీ చుట్టుగుళ్ల దుర్గావతి కిషోర్, డాక్టర్ బి. ఆర్ అంబేద్కర్ కోనసీమ జిల్లా ఎస్సీ,ఎస్టీ విజిలెన్స్ ఊ మానిటరింగ్ కమిటీ సభ్యులు వెంట్రు సుధీర్, నాగబత్తుల సుబ్బారావు,విత్తనాల జానికిరామయ్య, ముమ్మిడివరం నియోజకవర్గ తెలుగు రైతు అధ్యక్షులు యాళ్ల ఉదయ్,కొమ్ముల నందిబాబు,పెదపూడి శ్రీను మరియు చీణూ కూటమి నాయకులు, కార్యకర్తలు తదితరులు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు

# భూములకు శాశ్వత పరిష్కారం చూపే దిశగా చర్యలు

## జిల్లా కలెక్టర్ చదలవాడ నాగరాణి



**మొగల్తూరు, సెప్టెంబర్ 25(తెలుగు రాష్ట్రం):** మొగల్తూరు మండలం కాళీపట్నం, రిజిస్ట్రేషన్ లేకుండా చాలా కాలంగా రైతులు స్వాధీనంలో ఉన్న భూములకు శాశ్వత పరిష్కారం చూపే ఉద్దేశంతో రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ఆదేశాల మేరకు జిల్లా యంత్రాంగం ప్రత్యేక చర్యలు చేపట్టిందని జిల్లా కలెక్టర్ చదలవాడ నాగరాణి అన్నారు. శుక్రవారం మొగల్తూరు మండలం కాళీపట్నం భూములకు సంబంధించి జగన్నాధపురం పాతపాడు కాళీపట్నం వెస్ట్, కాళీపట్నం ఈస్ట్ గ్రామాలలో ఆమె పర్యటించారు. కాళీపట్నం భూములు వివరాల పరిశీలన నిమిత్తం నియమించిన బృందాల పనితీరును క్షేత్రస్థాయిలో పరిశీలించారు. ఆయా గ్రామాలలో భూములలో ఉన్న రైతులు వద్ద నుండి బృందాలు సేకరిస్తున్న వివరాలు కలెక్టర్ అడిగి తెలుసుకున్నారు. భూములకు సంబంధించిన హక్కు పత్రాలు ఇతర ఆధారాల పరిశీలన తదితర అంశాలను ఆమె పరిశీలించారు. అనంతరం కాళీపట్నం వెస్ట్ గ్రామంలో రైతు సేవా కేంద్రం సందర్శించి రైతులు నుండి వివరాలను సేకరిస్తున్న బృందాలతో మాట్లాడారు. భూములకు సంబంధించిన హక్కుల పత్రాలు అందుబాటులో ఉన్న ఇతర ఆధారాలను క్షుణ్ణంగా పరిశీలించాలన్నారు. భూ వివరాలు సేకరణలో ఏటువంటి పొరపాట్లకు అవకాశం లేకుండా అత్యంత జాగ్రత్తగా చేయాలని అధికారులకు ఆమె దిశ నిర్దేశం చేశారు. చాలా కాలంగా రిజిస్ట్రేషన్ లేకుండా రైతులు స్వాధీనంలో ఉన్న భూములు కు పరిష్కారం చూపే ప్రక్రియలో భాగంగా నిర్వహిస్తున్న ఈ సర్వే పత్రాల సేకరణ నిబంధనలకు అనుగుణంగా నిష్పక్షపాతంగా పారదర్శకతతో చేయాలని అధికారులతో అన్నారు. భూములకు సంబంధించిన యజమానులు, రైతులు, తమ వద్ద ఉన్న హక్కు పత్రాలు పాత రికార్డులు ఇతర సంబంధిత ఆధారాలను అధికారులకు అందించి సర్వే పరిశీలన ప్రక్రియకు పూర్తి సహకారం అందించాలని కలెక్టర్ కోరారు. ఈ సందర్భంలో






నరసాపురం రెవిన్యూ డివిజనల్ అధికారి దాసిరాజు, తహశీల్దార్ షేక్ మహమ్మద్ ఫరూక్, సంబంధిత డీటీలు, మండల సర్వేలు, వీఆర్వోలు, సిబ్బంది, రైతులు, తదితరులు పాల్గొన్నారు

# కేజీబీవీలో జాతీయ నులిపురుగుల దినోత్సవం

## విద్యార్థినులకు నులిపురుగుల నివారణపై అవగాహన

## సందర్శించిన జోనల్ మలేరియా అధికారులు



**అనంతగిరి: సెప్టెంబర్ 25 (తెలుగు రాష్ట్రం విలేఖరి)** జాతీయ నులిపురుగుల దినోత్సవం సందర్భంగా అనంతగిరి మండలం కొత్తూరు కేజీబీవీ పాఠశాలను అనంతగిరి పీహెచ్‌సీ వైద్యాధికారులు,సిబ్బంది శుక్రవారం సందర్శించారు. ఈ సందర్భంగా పాఠశాలలోని విద్యార్థినులకు డీ-వర్మింగ్ మాత్రలు వేయించి, నులిపురుగుల నివారణపై అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమాన్ని అనంతగిరి మండలానికి ప్రత్యేకంగా కేటాయించిన జోనల్ మలేరియా అధికారి డా. బి. ప్రభావతి, స్టేట్ ఎన్‌సీడీసీడీ అండ్ ఎపిడెమియాలజికల్ నోడల్ పర్సన్ డా. స్నేహ సమీరా సందర్శించారు. పాఠశాలలో డీ-వర్మింగ్ కార్యక్రమం నిర్వహిస్తున్న తీరును పరిశీలించి, విద్యార్థులకు మాత్రల పంపిణీ, ఆరోగ్య సిబ్బంది పనితీరుపై వివరాలు అడిగి తెలుసుకున్నారు. అనంతరం శివలింగపురం బాలికల ఆశ్రమ పాఠశాలను సందర్శించిన అధికారులు అక్కడ కూడా జాతీయ నులిపురుగుల నిర్మూలన కార్యక్రమం అమలు తీరును పరిశీలించారు. విద్యార్థులకు అందుతున్న ఆరోగ్య సేవలు, సిబ్బంది పనితీరుపై ఆరా తీశారు. ఈ కార్యక్రమంలో జోనల్ మలేరియా అధికారి డా. బి. ప్రభావతి, సీనియర్ ఎపిడెమియాలజిస్ట్ డా. స్నేహ సమీరా, పీహెచ్‌సీ వైద్యులు డా. చంద్రకాంత్, డా. కళ్యాణ్, పీఎంజుఉ సింహాచలం, పీహెచ్ఎన్ పీవీ లక్ష్మి, హెల్త్ అసిస్టెంట్ సూర్యారావు, ఏఎన్ఎం దోయామోతి, రామచంద్ర, ఆశ కార్యకర్తలు లక్ష్మి, సుందరి, జోనల్ మలేరియా కార్యాలయ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.



# మహిళా కానిస్టేబుల్ విజయను

# సత్కరించిన హోం మంత్రి అనిత





**పాయకరావుపేట, (తెలుగు రాష్ట్రం ప్రతినిధి )సెప్టెంబరు 25 :** పాయకరావుపేట పోలీసు స్టేషన్ మహిళా కానిస్టేబుల్ వంటరి విజయ తన ప్రతిభతో అందరి ప్రశంసలు అందుకుంటున్నారు. పోలీసు విధులను సమర్ధంగా నిర్వహిస్తూనే క్రీడల్లోనూ సత్తా చాటుతున్నారు. ఇటీవల అమరావతిలో నిర్వహించిన రాష్ట్ర స్థాయి పోలీస్ క్రీడా పోటీల్లో అద్భుత ప్రతిభ కనబరిచారు. మొత్తం ఆరు విభాగాల్లో పాల్గొని ఆరు బంగారు పతకాలను సాధించారు. 5 వేల మీటర్లు, 1500 మీటర్లు, 800 మీటర్ల పరుగుతో పాటు 400ఐ4 మీటర్ల రిలేలోనూ ప్రథమ స్థానంలో నిలిచి స్వర్ణ పతకాలు కైవసం చేసుకున్నారు. అదేవిధంగా ఖోఖో, కబడ్డీ పోటీల్లోనూ విజయ ప్రాతినిధ్యం వహించిన జట్లు ప్రథమ స్థానంలో నిలిచాయి. దీంతో ఆయా విభాగాల్లోనూ ఆమె బంగారు పతకాలను సొంతం చేసుకున్నారు. విధి నిర్వహణతో పాటు క్రీడల్లోనూ ప్రతిభ కనబరుస్తూ విజయ సాధించిన ఈ విజయాలు పోలీసు శాఖకు గర్వకారణంగా నిలిచాయి. ఈ సందర్భంగా శుక్రవారం ఉదయం నక్కపల్లిలోని తన నివాసంలో మహిళా కానిస్టేబుల్ విజయతో హోం మంత్రి అనిత టిఫిన్ చేస్తూ, వివిధ అంశాలపై చర్చించారు. అనంతరం కానిస్టేబుల్ విజయను ఘనంగా సత్కరించి అభినందించారు. క్రీడల్లో విజయ సాధించిన పతకాల వివరాలను అడిగి తెలుసుకుని ప్రత్యేకంగా ప్రశంసించారు. విధి నిర్వహణతో పాటు క్రీడల్లోనూ రాణిస్తూ పలువురికి విజయ స్ఫూర్తిగా నిలుస్తున్నారని హోంమంత్రి అనిత పేర్కొన్నారు. భవిష్యత్‌లో మరిన్ని విజయాలు సాధించాలని ఆకాంక్షించారు. అదేవిదంగా పాయకరావుపేట పోలీస్ పరిధిలో పలు కేసులు దర్యాప్తులో కీలకపాత్ర వహించడమే కాకుండా, సాంకేతికంగా విధుల్లో ఉత్తమ ప్రతిభ కనబరుస్తున్న కానిస్టేబుల్ రాంబాబును కూడా హోం మంత్రి అనిత సత్కరించారు. ఇటీవల అవయవ దానం చేసిన నర్సీపట్నం డీఎస్పీ పోతిరెడ్డి శ్రీనివాసరావును హోం మంత్రి అనిత అభినందించారు. ఈ కార్యక్రమంలో పాయకరావుపేట సిఐ ఎం వినోద్ బాబు, నక్కపల్లి సిఐ జూరెడ్డి మురళి, అడ్డురోడ్డు సిఐ లొద్దు రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.



# "వివేకానంద యువ ఫోరమ్

# " నూతన కార్యవర్గం ప్రమాణస్వీకారం




**కాట్రేనికోన, సెప్టెంబర్ 25 ( తెలుగు రాష్ట్రం విలేఖరి ):** మండల పరిధిలోని చెయ్యేరు గ్రామం శ్రీనివాస ఇంజనీరింగ్ కళాశాల నందు వివేకానంద కేంద్ర, కన్యాకుమారి సేవా సంస్థ విద్యార్థి విభాగం " వివేకానంద యువ ఫోరమ్ " కార్యవర్గ ప్రమాణ స్వీకార కార్యక్రమం శుక్రవారం కళాశాలలో నిర్వహించారు . వ్యక్తి నిర్మాణం - దేశ నిర్మాణం అనే నినాదం తో వ్యక్తిత్వవికాసం తద్వారా దేశాభివృద్ధి కోసం వివేకానంద కేంద్ర పని చేస్తుంది. దేశ వ్యాప్తంగా అనేక యూనివర్సిటీలు మరియు కళాశాలలో వివేకానంద కేంద్ర విద్యార్థి విభాగం " వివేకానంద యువ ఫోరమ్ " కార్యక్రమాలు నిర్వహిస్తుంది. వివేకానంద యువ ఫోరమ్ ద్వారా విద్యార్థుల సర్వతోముఖాభివృద్ధికి వివేకానంద కేంద్ర పనిచేస్తుంది. సేవా, స్వాధ్యాయ, సాహస్ మరియు దేశభక్తి అనే నాలుగు విభాగాలుగా వివేకానంద యువ ఫోరమ్ పని చేస్తుంది. కళాశాల ప్రిన్సిపాల్ డా. బి రత్న రాజు ముఖ్య అతిధిగా పాల్గొన్న కార్యక్రమంలో వివేకానంద కేంద్ర, అమలాపురం కార్యస్థాన్ సంయోజక్ మేజర్ శారద కార్యవర్గ ప్రమాణస్వీకారం చేయించారు. వివేకానంద యువ ఫోరమ్ గౌరవ చైర్మన్ గా కళాశాల ప్రిన్సిపాల్ కొనసాగుతారు. ఈ కార్యక్రమంలో వివేకానంద కేంద్ర కన్యాకుమారి ఆంధ్రప్రదేశ్, తెలంగాణ మరియు ఒడిశా రాష్ట్రాల ప్రముఖ్ మాననీయ రవి నాయుడు ముఖ్య వక్తగా గోదావరి విభాగ్ సంఘటక్ గండికోట శ్రీనివాస మరో వక్తగా విద్యార్థులకు దిశా నిర్దేశం చేసారు. శ్రీనివాస్ ఇంజనీరింగ్ కళాశాల వివేకానంద యువ ఫోరమ్ సంయోజక్ గా అసిస్టెంట్ ప్రొఫెసర్ జి సతీష్ ప్రమాణ స్వీకారం చేసారు. సహ సంయోజకులుగా అసిస్టెంట్ ప్రొఫెసర్లు వై పి. ఎస్ హరి కృష్ణ, కె స్వర్ణ, పి డి ఎన్ గణేష్, ఎం ప్రసాద్, బి సత్య దుర్గ,మరియు నాలుగు విభాగాల ప్రముఖ్ మరియు సహ ప్రముఖ్ లుగా విద్యార్థులు పి. ఎల్. మంజూష, ఎస్ తన్మయశ్రీ, జె ప్రసన్న, కె సత్య నాగ శ్రీ, షేక్ అహ్మద్, కె కరీం, బి మంజు, పి సుమాంజలి ప్రమాణ స్వీకారం చేసారు. ఈ కార్యక్రమంలో అమలాపురం కార్యస్థాన్ సహ సంయోజకులు సుపర్ణ మరియు పాలగుమ్మి వెంకట కృష్ణ తదితరులు పాల్గొన్నారు.

## పార్టీలకు అతీతంగా

# సంక్షేమ పథకాలు అందిస్తున్నాం..

# ఎమ్మెల్యే అమిలినేని

### సంక్షేమానికి నాంది పలికింది టీడీపీ పార్టీనే..స్థానిక సంస్థల జిల్లా ఇంచార్జ్ ఏరాసు ప్రతాప్ రెడ్డి

### విభిన్న ప్రతిభా వంతులు కూడా అందరితో సమానంగా ఉండాలి..జిల్లా అధ్యక్షుడు పూల నాగరాజు





**కళ్యాణదుర్గం సెప్టెంబర్. 25 తెలుగు రాష్ట్రం విలేఖరి** సంక్షేమ పథకాలను ఏఒక్కరికో లేదా ఏదో ఒక పార్టీకి మాత్రమే కాకుండా అర్హులైన ప్రతి ఒక్కరికి అందించిన ఘనత కూటమి ప్రభుత్వానికి దక్కుతుందని ఎమ్మెల్యే అమిలినేని సురేంద్ర బాబు పేర్కొనగ, రెండు రూపాయలకు కిలో బియ్యం అందించి పేదలను ఆనాడు ఆదుకున్నది అన్న ఎన్టీఆర్ అయితే ఆ సంక్షేమం ఎక్కడా ఆగకుండా నేడు వికలాంగులకు ట్రై స్కూటీలు అందించిన నాయకుడు చంద్రబాబు నాయుడు ని మాజీ మంత్రి, అనంతపురం జిల్లా స్థానిక సంస్థల ఎన్నికల ఇంచార్జ్ ఏరాసు ప్రతాప్ రెడ్డి పేర్కొనగ, విభిన్న ప్రతిభా వంతులు కూడా సామాన్యులతో పాటు తమ పనులు తాము చేసుకునేలా వారికి కూటమి ప్రభుత్వం ట్రై స్కూటీలో అందించారని జిల్లా టీడీపీ అధ్యక్షులు పూల నాగరాజు పేర్కొన్నారు..నేడు ఆంధ్రప్రదేశ్ విభిన్న ప్రతిభా వంతులు వయోవృద్ధుల సహాయ సంస్థ ఆధ్వర్యంలో జిల్లా కలెక్టర్, జాయింట్ కలెక్టర్ ఆధ్వర్యంలోని కమిటీ పారదర్శకంగా అర్హులైన వారిని ఎంపిక చేయగా నేడు ప్రజావేదిక నందు పది మంది విభిన్న ప్రతిభా వంతులకు ఎమ్మెల్యే అమిలినేని సురేంద్ర బాబు , మాజీ మంత్రి స్థానిక సంస్థల ఎన్నికల జిల్లా ఇంచార్జ్ ఏరాసు ప్రతాప్ రెడ్డి గారు, జిల్లా తెలుగుదేశం పార్టీ అధ్యక్షులు పూల నాగరాజు , విభిన్న ప్రతిభా వంతులు, వయో వృద్ధుల సహాయ సంస్థ అధికారులు, టీడీపీ నాయకుల సమక్షంలో అందజేశారు..ఈ సందర్భంగా ఎమ్మెల్యే అమిలినేని మాట్లాడుతూ దేశ ప్రధాని నరేంద్ర మోడీ సహకారంతో రాష్ట్ర ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు , ఉపముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్, మంత్రి నారా లోకేష్ రాష్ట్రాన్ని అభివృద్ధి బాటలో నడుపుతున్నారని, ఎక్కడా కూడా అర్హులకు అన్యాయం జరగకుండా ప్రతి ఒక్కరికి సంక్షేమ పథకాలు అందిస్తున్నారని, మా కళ్యాణదుర్గం ప్రాంతంలో ఎంతో మంది వైసీపీ కార్యకర్తలకు ముఖ్యమంత్రి సహాయనిది అందించడమే కాకుండా నేడు పంపిణీ చేసిన ట్రై స్కూటీలలో కూడా ఇద్దరు వైసీపీ కార్యకర్తలకు అందించామని మాకు పార్టీలు ముఖ్యం కాదని కేవలం అర్హత ఉన్న వారికి అందించి వారికి అండగా ఉండాలనే లక్ష్యం మాదని అన్నారు..అంతే కాకుండా ప్రజలకు సేవ చేసే భాగ్యం కల్పించిన ఈ ప్రాంత ప్రజలకు ఋణపడి ఉంటానని అన్నారు..

# ఘనంగా పండిట్ దీన్‌దయాళ్ ఉపాధ్యాయజయంతి

## పండిట్ దీన్ దయాళ్ చిత్రపటానికి బిజెపి నాయకులు నివాళులు



**మొగల్తూరు సెప్టెంబర్ 25 (తెలుగురాష్ట్రం ):** భారతీయ జనసంఘ్ సిద్ధాంతకర్త, ఏకాత్మ మానవతావాదం ప్రతిపాదకులు, మహనీయులు పండిట్ దీన్‌దయాళ్ ఉపాధ్యాయ జీ జయంతి సందర్భంగా బిజెపి మండల అధ్యక్షుడు కొల్లాటి చెన్నకేశవరావు ఆధ్వర్యంలో మొగల్తూరు మండలం ముత్యాలపల్లి, మోడి గ్రామంలో బిజెపి నాయకులు, కార్యకర్తలు ఘన నివాళులు అర్పించారు. మండల బిజెపి అధ్యక్షుడు కొల్లాటి చెన్నకేశవరావు మాట్లాడుతూ.. పండిట్ దీన్‌దయాళ్ ఉపాధ్యాయ జీ ప్రతిపాదించిన అంత్యోదయ స్ఫూర్తి సమాజంలోని చివరి వ్యక్తి వరకు అభివృద్ధి ఫలాలు చేరాలనే ఉన్నతమైన లక్ష్యాన్ని చాటిచెప్పిందని, దేశ అభివృద్ధి అనేది కేవలం ఆర్థిక ప్రగతితో కాకుండా ప్రతి వ్యక్తి గౌరవం, సంక్షేమం, సమగ్ర అభ్యున్నతితోనే సాధ్యమవుతుందని ఆయన ఆలోచనలు తెలియజేస్తాయని అన్నారు. "దేశం ముందు -- పార్టీ తర్వాత -- వ్యక్తి చివర" అనే సేవా భావంతో ప్రజల కోసం పనిచేయడం, సమాజంలోని ప్రతి వర్గానికి అభివృద్ధి అవకాశాలు అందించడం పండిట్ దీన్‌దయాళ్ ఉపాధ్యాయ జీ ఆశయాలకు నిజమైన నివాళి అని ఆయన సిద్ధాంతాలను స్ఫూర్తిగా తీసుకుని దేశ సేవలో ప్రతి బీజేపీ కార్యకర్త మరింత చురుకుగా పనిచేయాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర కిసాన్ మోర్చా కార్యదర్శి దాసరి బాబి, బిజెపి మండల ప్రధాన కార్యదర్శి బొరుసు శివ, తిరుమాని స్వామి, కొప్పనాతి పెద్దిరాజు, బంధన శ్రీనివాసు, బిజెపి నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

పోలవరం, పాడేరు, రాయలసీమ ఉభయ గోదావరి జిల్లాలు
https://epaper.teluguraastram.com
తెలుగురాష్ట్రం దినపత్రిక

# పోషణ మాసం ఉత్సవాలో పాల్గొన్న డా. శీరిగినీడి రాజ్యలక్ష్మి





**నరసాపురం/ మొగల్తూరు25 (తెలుగు రాష్ట్రం);**
అన్ని అంగన్వాడీ కేంద్రాలలో జరుగుతున్న అంగన్వాడీ పోషణ మాసం ఉత్సవాలలో భాగంగా నరసాపురం మండలం చిట్టవరం గ్రామంలో అంగన్వాడీ కేంద్రానికి, పిల్లలకు అంగన్వాడీ కార్యకర్తలు అందిస్తున్న సేవలకు గుర్తింపుగాను వారిని సన్మానించారు.సి.డి.పి.వో ఉమ ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమానికి ముఖ్య అతిధిగా హాజరయిన రాష్ట్ర మహిళా కమిషన్ మాజీ సభ్యురాలు మరియు ప.గో జిల్లా తెలుగు మహిళా అధ్యక్షురాలు డా.శిరిగినీడి రాజ్యలక్ష్మి పాల్గొని మాట్లాడుతూ.. అంగన్వాడీ కార్యకర్తలు పిల్లలకు చేస్తున్న సేవలు అనందనీయమన్నారు. కూటమి ప్రభుత్వం మహిళలకు ఎన్నో సంక్షేమ పథకాలను తీసుకు వచ్చిందని వాటిని మహిళలు సద్వినియోగపరచుకోవాలన్నారు. అదే విధంగా చిన్నారులకు జంక్ ఫుడ్ వద్దని, ఇంటి ఫుడ్ ముద్దని, అంగన్వాడీ కేంద్రంలో ఇచ్చే పోషకాహారాన్ని ఇస్తే పిల్లలు ఆరోగ్యంగా ఉంటారని ఆరోగ్యంగా ఉన్నప్పుడే ఏదైనా సాధించగలరని డా. రాజ్యలక్ష్మి అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో సూపర్ వైజర్ పద్మావతి, అంగన్వాడీ సిబ్బంది, రేపు ప్రభుదాసు, గ్రంథి శ్రీను, కొ ప్పినీడి నాగు, పైడికొండల కృష్ణ, నక్కాలక్ష్మీ నారాయణ, పాలంకి చిన్నా తదితరులు పాల్గొన్నారు.

# “గ్రీవెన్స్, ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమం



**నర్సాపురం/మొగల్తూరు 25(తెలుగు రాష్ట్రం):**
నరసాపురం నియోజకవర్గంలో తెలుగుదేశం పార్టీ కార్యాలయంలో శుక్రవారం నియోజకవర్గ తెలుగుదేశం పార్టీ ఇంచార్జ్ పొత్తూరి రామరాజు ఆధ్వర్యంలో “గ్రీవెన్స్ , ప్రజా సమస్యల పరిష్కార వేదిక” కార్యక్రమం నిర్వహించారు. ఈ వేదిక ద్వారా నియోజకవర్గ ప్రజలు మరియు పార్టీ కార్యకర్తల నుండి ఇళ్ల స్థలాలు, పెన్షన్లు, రోడ్లు, డ్రైనేజీలు తదితర స్థానిక సమస్యలపై వినతులు, ఫిర్యాదులు స్వీకరించారు. అందిన ప్రతి సమస్యను సవివరంగా పరిశీలించి, సంబంధిత అధికారులతో చర్చించి తక్షణ పరిష్కారానికి చర్యలు తీసుకుంటామని రామరాజు తెలిపారు. ఈ కార్యక్రమంలో తెలుగుదేశం పార్టీ నాయకులు, కార్యకర్తలు, పాల్గొన్నారు.

# జలమయమైన రహదారులు, గ్రామాలు
## రహదారిపై నీళ్లు నిలబడి వాహనదారులు ఇక్కట్లు



**మొగల్తూరు సెప్టెంబర్ 25(తెలుగు రాష్ట్రం విలేఖరి):**
గత మూడు రోజులుగా కురిసిన వర్షాలకు మొగల్తూరు మరియు మండల పరిధిలో గ్రామాలు లోతట్టు ప్రాంతాలు జలమయమయ్యాయి. మురికి నీరు రోడ్డుపైకి చేరింది. కొన్ని గ్రామాల్లో డ్రైనేజీ వ్యవస్థ సక్రమంగా లేకపోవడంతో వర్షపు నీరు రోడ్డుపై నిలిచిపోతుందని స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. మొగల్తూరు మండలం జగన్నాథపురం గ్రామం నుండి జాతీయ రహదారికి వెళ్లే ప్రధాన రహదారిలో వర్షం నీరు బయటికి వెళ్లే మార్గం లేక చెరువులగా తలపిస్తుంది. అధికారులు స్పందించి నీరు బయటికి తోడించాలని వాహనదారులు కోరుతున్నారు.

## ఎమ్మెల్యే కాగిత కృష్ణ ప్రసాద్ పై
# వైసీపీ నేత ఉప్పాల రాము వ్యాఖ్యలు అర్ధరహితం

**కృత్తివెన్ను సెప్టెంబర్ 25(తెలుగు రాష్ట్రం ప్రతినిధి)**
ఎమ్మెల్యే కాగిత కృష్ణ ప్రసాద్ ఆయన తండ్రి స్వర్గీయ కాగిత వెంకట్రావు వెంట తిరుగుతూ అయన మనుషులం అని చెప్పుకుని పైకి వచ్చిన మీరు, మాజీ శాసన సభ్యులు, మాజీ టీటీడీ చైర్మన్ కాగిత వెంకట్రావు పై యిప్పుడు పేలుతున్న అవాకులు, చవాకులు చూస్తుంటే మీలాంటి వాళ్ళ వల్ల ప్రజలు పరోపకారం అంటే అపకారం అనే భావానికి వస్తారు ఉప్పాల రాము అంటూ కృత్తివెన్ను మండల టీడీపీ సీనియర్ నాయకులు పిన్నెంటి రత్తయ్య అన్నారు. అస్సలు ఏమి అర్హత ఉందని నీకు పెడన నియోజకవర్గం అభివృద్ధి ప్రదాత అయిన కాగిత కృష్ణా ప్రసాద్ విమర్శిస్తున్నావని , జిల్లా జడ్పీ చైర్మన్ అయ్యాక పెడన నియోజకవర్గం వైసీపీ ఇంచార్జ్ వచ్చేవరకు నియోజకవర్గంకూ ఒక్క రూపాయి కూడా జడ్పీ నిధులు కేటాయించడానికి ముందుకు రాని నువ్వు కేవలం నీ స్వార్థం కోసం నీకు ఇంచార్జ్ గా అవకాశం ఇవ్వగానే నియోజకవర్గంలో తుతూ మంత్రంగా నాలుగు పనులు చేసేసి ఏం ఎల్ ఎ అయిపోవాలి అని పగటి కలలు కన్నావు, నీ స్వార్థం కనిపెట్టే ప్రజలు ఈ నియోజకవర్గం మల్లేశ్వరం నియోజకవర్గం గా ఉండగా గాని పెడన నియోజకవర్గం అయ్యాక ఎవ్వరిని ఓడించని అంతా దారుణంగా నిన్ను ఓడించి ఏ అభ్యర్థికి యివ్వానంత భారీ మెజారిటీ 38, 000 ఓట్లు పై చిలుకాతో మా శాసన సభ్యులు కాగిత కృష్ణా ప్రసాద్ ను గెలిపించారు. అని పిన్నెంటి రత్తయ్య అన్నారు. జెడ్పి చైర్మన్ గా ఉన్న సమయంలో మీ ప్రభుత్వంలో మీ నాయకుడు జగన్ వస్తున్నాడు అని మీరు కట్టిన బ్యానర్లు



జోగి రమేష్ పీకి పెడన మునిసిపల్ డంపింగ్ లో పారేస్తే యిల్లు దాటాడానికి ఆలోచన చెయ్యని నువ్వు 2029లో గెలిస్తే ఏదో చేసేస్తావని ఆ బందర్ బోడిలింగం వాగడం, మీ బులుగు మంద ఉగడం మరి ఓవర్ గా లేదు అని పిన్నెంటి రత్తయ్య అన్నారు. అస్సలు మీ బులుగు మందలోనే 60 నుంచి 70 శాతం నెక్స్ట్ నీకు సిటు రాదని, మళ్ళీ ఒకవేళ నీకు సిటు యిచ్చిన గెలవవు అని, మళ్ళీ పెడన వైసీపీ అసెంబ్లీ టిక్కెట్ జోగి రమేష్ ఎత్తుకుపోతాడు అని బహిరంగంగానే అంటున్నారు. నువ్వుపోయి మా కాగిత కృష్ణా ప్రసాద్ ను విమర్శలు చెయ్యడం చూస్తుంటే వెనుకటికి ఎవడో ఆకాశం మీదా ఉమ్మితే తిరిగి వాడి మొకం మీదనే పడింది అంట ఆలా ఉంది నీ వ్యవహారం రాము అని పిన్నెంటి రత్తయ్య అన్నారు. ప్రపంచం మొత్తం ఎల్ నీనో ఏఫెక్ట్ ఉన్న అది ఏదో ఆంధ్రప్రదేశ్ కూ పెడనకు పరిమితం అన్నట్టుగా మీరు వాగినా వాగుడుకి ఆ వరుణ దేవుడు కూ సైతం ఆగ్రహం వచ్చి సంవృద్ధిగా వర్షం నీరు యిచ్చాడు. పాపం వరుణ దేవుడు యిచ్చిన షాక్ కి మీ ప్యూజులు యెగిరిపోయి ఉంటాయి. అధికారంలో ఉన్న అయిదేళ్లు 80 శాతం పూర్తి అయినా పోలవరం ను నాశనం చేసింది మీ పార్టీనే అంతేకాదు మీ ప్రభుత్వం హయాంలో కృత్తివెన్ను మండలంలో చేతికి వచ్చిన పంటపై వడగాళ్లు వాన పడి రైతులు తీవ్రంగా నష్టపోతే జోగి రమేష్ దెబ్బకు నువ్వు బయటకు రాలేదు, యిప్పుడు మాత్రం నీకు రైతుల పట్ల ముసలి కన్నీరు వస్తుంది. తీరు మార్చుకోకపోతే రాము నెక్స్ట్ ఎన్నికల్లో నీకు డిపాజిట్ లు కూడా రావు, యిప్పటికైనా నీ స్థాయి తెలుసుకుని మాట్లాడు, నోరు ఉంది కదా అని మా కాగిత కృష్ణా ప్రసాద్ మీదా విమర్శలు చేస్తే ఉపేక్షించేది లేదు అని పిన్నెంటి రత్తయ్య అన్నారు.

# పార్టీలకు అతీతంగా సంక్షేమ పథకాలు అందిస్తున్నాం..ఎమ్మెల్యే అమిలినేని
## సంక్షేమానికి నాంది పలికింది టీడీపీ పార్టీనే..స్థానిక సంస్థల జిల్లా ఇంచార్జ్ ఏరాసు ప్రతాప్ రెడ్డి





**కళ్యాణదుర్గం, సెప్టెంబర్ 25 (తెలుగు రాష్ట్రం విలేఖరి ):**
సంక్షేమ పథకాలను ఏఒక్కరికో లేదా ఏదో ఒక పార్టీకి మాత్రమే కాకుండా అర్హులైన ప్రతి ఒక్కరికి అందించిన ఘనత కూటమి ప్రభుత్వానికి దక్కుతుందని ఎమ్మెల్యే అమిలినేని సురేంద్ర బాబు పేర్కొనగ, రెండు రూపాయలకు కిలో బియ్యం అందించి పేదలను ఆనాడు ఆదుకున్నది అన్న ఎన్టీఆర్ అయితే ఆ సంక్షేమం ఎక్కడా ఆగకుండా నేడు వికలాంగులకు ట్రై స్కూటీలు అందించిన నాయకుడు చంద్రబాబు నాయుడు ని మాజీ మంత్రి, అనంతపురం జిల్లా స్థానిక సంస్థల ఎన్నికల ఇంచార్జ్ ఏరాసు ప్రతాప్ రెడ్డి పేర్కొనగ, విభిన్న ప్రతిభా వంతులు కూడా సామాన్యులతో పాటు తమ పనులు తాము చేసుకునేలా వారికి కూటమి ప్రభుత్వం ట్రై స్కూటీలో అందించారని జిల్లా టీడీపీ అధ్యక్షులు పూల నాగరాజు పేర్కొన్నారు..నేడు ఆంధ్రప్రదేశ్ విభిన్న ప్రతిభా వంతులు వయోవృద్ధుల సహాయ సంస్థ ఆధ్వర్యంలో జిల్లా కలెక్టర్, జాయింట్ కలెక్టర్ ఆధ్వర్యంలోని కమిటీ పారదర్శకంగా అర్హులైన వారిని ఎంపిక చేయగా నేడు ప్రజావేదిక నందు పది మంది విభిన్న ప్రతిభా వంతులకు ఎమ్మెల్యే అమిలినేని సురేంద్ర బాబు , మాజీ మంత్రి స్థానిక సంస్థల ఎన్నికల జిల్లా ఇంచార్జ్ ఏరాసు ప్రతాప్ రెడ్డి గారు, జిల్లా తెలుగుదేశం పార్టీ అధ్యక్షులు పూల నాగరాజు , విభిన్న ప్రతిభా వంతులు, వయో వృద్ధుల సహాయ సంస్థ అధికారులు, టీడీపీ నాయకుల సమక్షంలో అందజేశారు..ఈ సందర్భంగా ఎమ్మెల్యే అమిలినేని మాట్లాడుతూ దేశ ప్రధాని నరేంద్ర మోడీ సహకారంతో రాష్ట్ర ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు , ఉపముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్, మంత్రి నారా లోకేష్ రాష్ట్రాన్ని అభివృద్ధి బాటలో నడుపుతున్నారని, ఎక్కడా కూడా అర్హులకు అన్యాయం జరగకుండా ప్రతి ఒక్కరికి సంక్షేమ పథకాలు అందిస్తున్నారని, మా కళ్యాణదుర్గం ప్రాంతంలో ఎంతో మంది వైసీపీ కార్యకర్తలకు ముఖ్యమంత్రి సహాయనిధి అందించడమే కాకుండా నేడు పంపిణీ చేసిన ట్రై స్కూటీలలో కూడా ఇద్దరు వైసీపీ కార్యకర్తలకు అందించామని మాకు పార్టీలు ముఖ్యం కాదని కేవలం అర్హత ఉన్న వారికి అందించి వారికి అండగా ఉండాలనే లక్ష్యం మాదని అన్నారు..అంతే కాకుండా ప్రజలకు సేవ చేసే భాగ్యం కల్పించిన ఈ ప్రాంత ప్రజలకు ఋణపడి ఉంటానని అన్నారు..

# ఎన్నికల కోఆర్డినేట్ కేంద్ర కమిటీ మెంబర్ గా యువ నాయకుడు ప్రశాంత్
## ఎమ్మెల్యే అంజిబాబు నివాసం వద్ద కేక్ కట్ చేసి స్వీట్స్ పంపిణీ చేసిన టీమ్ ప్రశాంత్, గునుపూడి యూత్

**భీమవరం: సెప్టెంబర్ 25: (తెలుగు రాష్ట్రం ప్రతినిధి) :**
జనసేన పార్టీ స్థానిక సంస్థల ఎన్నికల కో ఆర్డినేటర్ కేంద్ర కమిటీ మెంబర్ గా యువ నాయకుడు, పులపర్తి ప్రశాంత్ ను నియమించడం సంతోషకరమని రాష్ట్ర పబ్లిక్ అకౌంట్స్ కమిటీ చైర్మన్ ఎమ్మెల్యే పులపర్తి రామాంజనేయులు (అంజిబాబు) అన్నారు. బ్యాంక్ కాలనీలోని ఎమ్మెల్యే అంజిబాబు నివాసం వద్ద శుక్రవారం టీమ్ ప్రశాంత్ యూత్, గునుపూడి యూత్ అధ్వర్యంలో కేక్ కట్ చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే అంజిబాబు మాట్లాడుతూ ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో త్వరలో జరగనున్న స్థానిక సంస్థల ఎన్నికల ప్రక్రియలో భాగంగా జనసేన పార్టీ శ్రేణుల నుండి సమాచారాన్ని సేకరించేందుకు 5 గురు సభ్యులతో కో ఆర్డినేటర్ కేంద్ర కమిటీ వేయడం జరిగిందని, సమన్వయం చేయడంతోపాటు, సేకరించిన సమాచారం ఎప్పటికప్పుడు పార్టీ అధ్యక్షులు పవన్ కళ్యాణ్ కు నివేదిక అందిస్తారని అన్నారు. ఐదుగురు సభ్యులతో ప్రత్యేక సమన్వయ కమిటీ వేయడంలో దానిలో మా తనయుడు యువ నాయకుడు ప్రశాంత్ ను జనసేన పార్టీ అధ్యక్షులు పవన్ కళ్యాణ్ నియమించారని అన్నారు. రానున్న స్థానిక సంస్థల ఎన్నికల్లో 100 శాతం స్ట్రైక్ రేట్ తో విజయం సాధించడమే లక్ష్యంగా పని చేద్దామని అన్నారు. రాష్ట్ర కృష్ణ బలిజ కార్పొరేషన్ చైర్మన్ గంటా త్రిమూర్తులు మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం బలోపేతానికి ప్రతిఒక్కరూ కృషి చేద్దామని, స్థానిక ఎన్నికల కో ఆర్డినేటర్ కేంద్ర కమిటీలో యువ నాయకుడు ప్రశాంత్ ను నియమించడం హర్షించదగ్గ విషయమని అన్నారు. ప్రభుత్వాసుపత్రి అభివృద్ధి కమిటి డైరెక్టర్ సుంకర దాసు, కొప్పి నీడి శ్రీనివాస్, రెడ్డి సత్తిబాబు, టీమ్ ప్రశాంత్ సభ్యులు మాట్లాడుతూ స్థానిక సంస్థల ఎన్నికల సమన్వయానికి 5 గురు సభ్యులతో కమిటి నియమించడం, వారిలో యువ నాయకుడు ప్రశాంత్ ను నియమించడం సంతోషకరమని



అన్నారు. అనంతరం కేక్ కట్ చేసి స్వీట్స్ పంపిణీ చేశారు. కార్యక్రమంలో టీం ప్రశాంత్ సభ్యులు, గునుపూడి యూత్ తదితరులు పాల్గొన్నారు.

# అత్యంత వైభవంగా నూతన జిల్లా పరిషత్ కార్యాలయం ప్రారంభం

**భీమవరం, సెప్టెంబర్ 24: (తెలుగు రాష్ట్రం ప్రతినిధి ):**
పశ్చిమ గోదావరి జిల్లా ప్రజల సౌలభ్యం కోసం భీమవరం హెడ్‌క్వార్టర్‌గా నూతన జిల్లా పరిషత్ కార్యాలయం శుక్రవారం అత్యంత వైభవంగా ప్రారంభమైంది. భీమవరం పాత బస్టాండ్ వద్ద పంచాయతీరాజ్ కార్యాలయం మొదటి అంతస్తులో ఏర్పాటు చేసిన ఈ తాత్కాలిక కార్యాలయంలో తొలుత అధికారిక శిలాఫలికాన్ని ఆవిష్కరించారు. అనంతరం జిల్లా కలెక్టర్ చదలవాడ నాగరాణి సీఈవో ఛాంబర్‌ను రిబ్బన్ కట్ చేసి ప్రారంభించగా, స్థానిక శాసనసభ్యులు పులపర్తి రామాంజనేయులు జిల్లా పరిషత్ ప్రత్యేక అధికారి అయిన జిల్లా కలెక్టర్ ఛాంబర్‌ను రిబ్బన్ కట్ చేసి అధికారికంగా ప్రారంభించారు. గత ఉమ్మడి జిల్లా పరిషత్ పాలకవర్గం పదవీకాలం సెప్టెంబర్ 24తో ముగియడంతో, రాష్ట్ర ప్రభుత్వ ఆదేశాల ప్రకారం సెప్టెంబర్ 25 నుండి నూతన జిల్లా పరిషత్ ప్రత్యేక అధికారిగా జిల్లా కలెక్టర్ చదలవాడ నాగరాణి పదవీ బాధ్యతలు స్వీకరించారు. స్థానిక సంస్థల ఎన్నికలు జరిగి, నూతన బాడీ ఏర్పడే వరకు కలెక్టర్ ఆధ్వర్యంలోనే జెడ్పీ పరిపాలన కొనసాగుతుంది. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ చదలవాడ నాగరాణి మాట్లాడుతూ జిల్లాల విభజన జరిగి నాలుగున్నర ఏళ్లు గడిచినా ఇప్పటివరకు జిల్లా పరిషత్ కార్యాలయం ఏలూరులోనే ఉమ్మడిగా కోనసాగిందని, నేడు భీమవరంలో నూతన జెడ్పీ ఏర్పాటు కావడం జిల్లా అభివృద్ధికి శుభసూచకమని అన్నారు. ఆంధ్రప్రదేశ్ అసెంబ్లీ డిప్యూటీ స్పీకర్, ఉండి శాసనసభ్యులు రఘురామ కృష్ణంరాజు మాట్లాడుతూ 99 ఏళ్ల క్రితం ప్రారంభమైన ఉమ్మడి జెడ్పీ ఇప్పుడు విభజన జరిగి భీమవరానికి రావడం సంతోషకరమన్నారు. రాష్ట్రవ్యాప్తంగా నేటి నుండి 28 కొత్త జిల్లా పరిషత్‌లు అందుబాటులోకి వచ్చాయని తెలిపారు. భీమవరంలో జెడ్పీ శాశ్వత భవన నిర్మాణానికి వీలుగా, రాబోయే మూడు నెలల లోపు స్థల సేకరణ పూర్తి చేసి శంకుస్థాపన చేసేలా కలెక్టర్ ప్రత్యేక చొరవ చూపాలని ఆయన



అన్నారు. స్థానిక శాసనసభ్యులు పులపర్తి రామాంజనేయులు మాట్లాడుతూ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు, ఉపముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ ల నాయకత్వంలో రాష్ట్రం సృజనాత్మకమైన ఆలోచనలతో ముందుకు వెళ్తోందన్నారు. జెడ్పీ కార్యాలయంతో పాటు జిల్లా హెడ్‌క్వార్టర్‌లోని అన్ని ప్రభుత్వ శాఖలు ఒకే చోట ఇంటిగ్రేటెడ్ ఆఫీస్ కాంప్లెక్స్ లో ఉండేలా 20 నుండి 25 ఎకరాల స్థలాన్ని సేకరించేందుకు స్థానికంగా సహాయం అందిస్తామని భరోసా ఇచ్చారు. అలాగే, భీమవరం అర్బన్ డెవలప్మెంట్ అథారిటీ కార్యాలయ ఏర్పాటుకు కూడా కలెక్టర్ చొరవ చూపాలని కోరారు. ఈ కార్యక్రమంలో భీమవరం ఏఎంసి చైర్మన్ కలిదిండి సుజాత, కృష్ణ బలిజి కార్పొరేషన్ చైర్మన్ గంటా త్రిమూర్తులు, జిల్లా గ్రంథాలయ చైర్మన్ జుత్తిగ నాగరాజు, డిపిఓ వై దోసి రెడ్డి, జిల్లా స్వచ్ఛ గ్రామం స్వచ్ఛ వార్డు శాఖ అధికారి వెంకటలక్ష్మి వివిధ శాఖల జిల్లా అధికారులు, ప్రజా ప్రతినిధులు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

# ములానీ స్పిన్ మాయ.. కుశాగ్ర సెంచరీ..

## ఆసీస్-ఏ పై భారత్-ఏ ఘన విజయం

- ఆస్ట్రేలియా-ఏతో జరిగిన తొలి మ్యాచ్‌లో భారత్-ఏ 162 పరుగుల తేడాతో ఘన విజయం
- మ్యాచ్‌లో మొత్తం ఏడు వికెట్లతో రాణించిన షామ్స్ ములానీ
- తొలి ఇన్నింగ్స్‌లో సెంచరీ సాధించిన కుమార్ కుశాగ్రకు 'ప్లేయర్ ఆఫ్ ది మ్యాచ్'
- కెప్టెన్ దేవదత్ పడిక్కల్ అర్ధశతకంతో రెండో ఇన్నింగ్స్‌లో కీలక పాత్ర
- భారత బౌలర్ల ధాటికి రెండో ఇన్నింగ్స్‌లో 200 పరుగులకే కుప్పకూలిన ఆస్ట్రేలియా-ఏ



ఆస్ట్రేలియా-ఏతో జరిగిన తొలి నాలుగు రోజుల మ్యాచ్‌లో భారత్-ఏ జట్టు ఆల్ రౌండ్ ప్రదర్శనతో అదరగొట్టింది. పుదుచ్చేరి సీఏపీ-సీషెమ్ స్టేడియంలో జరిగిన ఈ మ్యాచ్‌లో 162 పరుగుల భారీ తేడాతో ఘన విజయం సాధించింది. లెఫ్ట్ ఆర్మ్ స్పిన్నర్ షామ్స్ ములానీ రెండో ఇన్నింగ్స్‌లో మూడు వికెట్లు పడగొట్టి, మ్యాచ్ మొత్తంలో 124 పరుగులిచ్చి 7 వికెట్లతో జట్టు విజయంలో కీలక పాత్ర పోషించాడు. 363 పరుగుల భారీ లక్ష్య ఛేదనలో భాగంగా, చివరి రోజైన శుక్రవారం 55/2 ఓవర్‌నైట్ స్కోరుతో బ్యాటింగ్ ప్రారంభించిన ఆస్ట్రేలియా-ఏ, భారత బౌలర్ల ధాటికి నిలవలేకపోయింది. తొలి గంటలోనే మీడియం పేసర్ అన్షుల్ కంబోజ్, ఓవర్‌నైట్ బ్యాటర్లు నాథన్ మెక్‌స్వీనీ (35), కెప్టెన్ పీటర్ హ్యాండ్స్‌కోంబ్ (16)లను ఔట్ చేసి ఆసీస్‌ను కోలుకోలేని దెబ్బ తీశాడు. ఆ తర్వాత పేసర్ తుషార్ దేశ్‌పాండే వరుస బంతుల్లో జోష్ ఫిలిప్, లియామ్ స్కాట్‌లను పెవిలియన్‌కు పంపి పతనాన్ని శాసించాడు. లంచ్ సమయానికి ఆస్ట్రేలియా-ఏ 185/7 స్కోరుతో కష్టాల్లో పడింది. లంచ్ తర్వాత షామ్స్ ములానీ మిగిలిన వికెట్లను పడగొట్టాడు. ఆసీస్ ఇన్నింగ్స్‌లో ఫెర్గస్ ఓ'నీల్ (47) టాప్ స్కోరర్‌గా నిలిచాడు. చివరికి ఆస్ట్రేలియా-ఏ 55.1 ఓవర్లలో 200 పరుగులకు ఆలౌట్ అయింది. అంతకుముందు తొలి ఇన్నింగ్స్‌లో 163 పరుగుల ఆధిక్యం సాధించిన భారత్-ఏ, తమ రెండో ఇన్నింగ్స్‌లో కెప్టెన్ దేవదత్ పడిక్కల్ (59) బాధ్యతాయుతమైన అర్ధశతకంతో రాణించాడు. ఓపెనర్ సాయి సుదర్శన్ (39)తో కలిసి పడిక్కల్ రెండో వికెట్‌కు 68 పరుగుల కీలక భాగస్వామ్యం నెలకొల్పాడు. అయితే, పడిక్కల్ ఔటైన తర్వాత భారత్-ఏ అనూహ్యంగా కుప్పకూలింది. చివరి ఆరు వికెట్లను కేవలం 48 పరుగులకే కోల్పోయి 199 పరుగులకు ఆలౌట్ అయింది. తొలి ఇన్నింగ్స్‌లో సెంచరీతో ఆకట్టుకున్న కుమార్ కుశాగ్ర (46 నాటౌట్) చివరి వరకు పోరాడాడు. తొలి ఇన్నింగ్స్‌లో అద్భుతమైన సెంచరీతో భారత్-ఏ భారీ స్కోరుకు పునాది వేసిన కుమార్ కుశాగ్రకు 'ప్లేయర్ ఆఫ్ ది మ్యాచ్' అవార్డు లభించింది. ఇరు జట్ల మధ్య రెండో మ్యాచ్ సెప్టెంబర్ 29 నుంచి అక్టోబర్ 2 వరకు ఇదే వేదికపై జరగనుంది. ఆ తర్వాత మూడు వన్డేల సిరీస్ కూడా జరగనుంది.

సంక్షిప్త స్కోర్లు:

భారత్-ఏ: 334 & 199

ఆస్ట్రేలియా-ఏ: 171 & 200 (ఫెర్గస్ ఓ'నీల్ 47; తుషార్ దేశ్‌పాండే 3-14, షామ్స్ ములానీ 3-57)

# క్రికెట్‌లో సంచలనం.. ఆఫ్ఘనిస్థాన్‌కు షాకిచ్చిన నేపాల్




క్రికెట్‌లో నేపాల్ జట్టు సంచలనం సృష్టించింది. కొరోగి స్పోర్ట్స్ పార్క్‌లో జరిగిన ఆసియా క్రీడల గ్రూప్-ఏ మ్యాచ్‌లో ఆల్‌రౌండ్ ప్రదర్శనతో పటిష్ఠమైన ఆఫ్ఘనిస్థాన్‌పై 5 వికెట్ల తేడాతో ఘన విజయం సాధించింది. బౌలింగ్, బ్యాటింగ్‌లో సమష్టిగా రాణించి ఆఫ్ఘన్ జట్టుకు షాకిచ్చింది. మొదట బౌలర్లు కట్టడి చేయగా, ఆ తర్వాత బ్యాటర్లు బాధ్యతాయుతంగా ఆడి జట్టును గెలిపించారు. ఈ మ్యాచ్‌లో మొదట బ్యాటింగ్ చేసిన ఆఫ్ఘనిస్థాన్‌ను నేపాల్ స్పిన్నర్లు కుశాల్ భుర్టెల్, లలిత్ రాజ్‌బంశీ తమ స్పిన్‌తో కట్టిపడేశారు. వీరి ధాటికి ఆఫ్ఘన్ బ్యాటర్లు పరుగులు చేయడానికి తీవ్రంగా ఇబ్బందిపడ్డారు. భుర్టెల్ 4 వికెట్లు పడగొట్టగా, రాజ్‌బంశీ కేవలం 13 పరుగులిచ్చి 3 కీలక వికెట్లు తీశాడు. దీంతో ఆఫ్ఘనిస్థాన్ స్వేచ్ఛగా ఆడలేకపోయింది. ఫైసల్ షినోజాదా (30), నజీబుల్లా జద్రాన్ (30) మాత్రమే కాస్త పోరాడటంతో ఆఫ్ఘన్ జట్టు నిర్ణీత 20 ఓవర్లలో 102 పరుగులు మాత్రమే చేయగలిగింది. అనంతరం 103 పరుగుల స్వల్ప లక్ష్యంతో బరిలోకి దిగిన నేపాల్‌కు ఆదిలోనే ఎదురుదెబ్బ తగిలింది. ఓపెనర్లు భుర్టెల్ (0), ఆసిఫ్ షేక్ (2) త్వరగా ఔటయ్యారు. కుశాల్ మల్లా కూడా రనౌట్ కావడంతో నేపాల్ 6.3 ఓవర్లలో 31 పరుగులకే 3 వికెట్లు కోల్పోయి కష్టాల్లో పడింది. ఈ దశలో సుందీప్ జోరా (34), రోహిత్ పౌడెల్ (33 నాటౌట్) బాధ్యతాయుతమైన భాగస్వామ్యం నెలకొల్పారు. వీరిద్దరూ వికెట్ల పతనాన్ని అడ్డుకొని, స్కోరు బోర్డును నెమ్మదిగా ముందుకు నడిపించారు. కీలక సమయంలో సుందీప్ జోరా రనౌట్ అయినా, కెప్టెన్ దీపేంద్ర సింగ్ ఐరీ (15)తో కలిసి రోహిత్ పౌడెల్ జట్టును విజయానికి చేరువ చేశాడు. పౌడెల్ 16, 17 ఓవర్లలో మూడు ఫోర్లు కొట్టి ఒత్తిడి తగ్గించాడు. విజయానికి ఒక్క పరుగు దూరంలో దీపేంద్ర ఔటైనా, గుల్షన్ ఝా సింగిల్ తీసి లాంఛనాన్ని పూర్తి చేశాడు. ఈ విజయంతో నేపాల్ తమ ఖాతా తెరిచింది. గ్రూప్-ఏలో ఆఫ్ఘనిస్థాన్ రెండు మ్యాచ్‌లలో ఒకటి గెలిచి, ఒకటి ఓడినా.. మెరుగైన నెట్ రన్ రేట్ కారణంగా టేబుల్‌లో అగ్రస్థానంలో ఉంది. నేపాల్ తన తదుపరి మ్యాచ్‌లో జపాన్‌తో తలపడనుంది. గ్రూప్‌లో టాప్-2 జట్లు క్వార్టర్ ఫైనల్స్‌కు అర్హత సాధిస్తాయి.

# జోష్నా చినప్ప అరుదైన రికార్డు..

## ఏడో ఏషియన్ గేమ్స్‌లో ఆరో పతకం ఖాయం




భారత స్క్వాష్ స్టార్ జోష్నా చినప్ప అరుదైన ఘనత సాధించారు. వరుసగా ఏడోసారి ఏషియన్ గేమ్స్‌లో పాల్గొంటున్న ఆమె.. ఈసారి మిక్స్‌డ్ డబుల్స్‌లో పతకాన్ని ఖాయం చేసుకున్నారు. వెలవన్ సెంథిల్‌కుమార్‌తో కలిసి సెమీఫైనల్‌కు చేరడంతో జోష్నా కెరీర్‌లో ఏషియన్ గేమ్స్ పతకాల సంఖ్య ఆరుకు చేరనుంది. 40 ఏళ్ల వయసులోనూ అద్భుత ప్రదర్శన కొనసాగిస్తూ జోష్నా మరోసారి భారత క్రీడా చరిత్రలో తన పేరును నిలిపారు. మిక్స్‌డ్ డబుల్స్ క్వార్టర్‌ఫైనల్లో జోష్నా చినప్ప--వెలవన్ సెంథిల్‌కుమార్ జోడీ ఫిలిప్పీన్స్‌కు చెందిన డేవిడ్ పెలినో--జెమికా అరిబాడో జోడీతో తలపడింది. భారత జోడీ ప్రారంభం నుంచే ఆధిపత్యం ప్రదర్శించింది. కేవలం అరగంటలోపే మ్యాచ్‌ను ముగిస్తూ 11-3, 11-5తో వరుస గేముల్లో విజయం సాధించింది. దీంతో సెమీఫైనల్‌కు చేరి భారత్‌కు కనీసం కాంస్య పతకం ఖాయం చేసింది.

**జోష్నాకు ఏడో ఏషియన్ గేమ్స్**

జోష్నా చినప్పకు ఇది వరుసగా ఏడో ఏషియన్ గేమ్స్. 2002 బుసాన్ ఏషియన్ గేమ్స్‌లో ప్రారంభమైన ఆమె ప్రయాణం.. 2026లో ఐచి-నగోయా గేమ్స్ వరకు కొనసాగింది. ఇలా ఏడు వరుస ఏషియన్ గేమ్స్‌లో పాల్గొన్న తొలి భారతీయురాలిగా ఆమె ఇప్పటికే రికార్డు సృష్టించారు. గతంలో భారత స్క్వాష్ స్టార్ సౌరవ్ ఘోషల్ ఆరు ఏషియన్ గేమ్స్‌లో పాల్గొన్న రికార్డును జోష్నా అధిగమించారు.

**16 ఏళ్ల తర్వాత మరో పతకం**

జోష్నా ఇప్పటికే ఏషియన్ గేమ్స్‌లో రెండు రజతాలు, మూడు కాంస్యాలు సాధించారు. 2010, 2022లో టీమ్ ఈవెంట్లలో కాంస్య పతకాలు, 2014, 2018లో టీమ్ ఈవెంట్లలో రజత పతకాలు, 2018లో సింగిల్స్‌లో కాంస్య పతకం సాధించారు. తాజా మిక్స్‌డ్ డబుల్స్ పతకంతో ఆమె ఖాతాలో ఆరో ఏషియన్ గేమ్స్ మెడల్ చేరనుంది. 2010లో తొలి పతకం సాధించిన తర్వాత సుమారు 16 ఏళ్లకు మరో పతకాన్ని ఖాయం చేసుకోవడం విశేషం.

**సెమీఫైనల్లో హాంకాంగ్ జోడీతో పోరు**

సెమీఫైనల్లో జోష్నా--వెలవన్ జోడీ హాంకాంగ్‌కు చెందిన యో కా లీ--మింగ్ హాంగ్ టాంగ్ జోడీతో తలపడనుంది. ఈ మ్యాచ్ శనివారం జరగనుంది. ఇప్పటికే పతకం ఖాయం చేసుకున్న భారత జోడీ.. సెమీఫైనల్లో గెలిస్తే ఫైనల్‌కు చేరి స్వర్ణం లేదా రజతం కోసం పోటీ పడే అవకాశం ఉంటుంది.

**40 ఏళ్ల వయసులోనూ అదే ఉత్సాహం**

సాధారణంగా క్రీడల్లో కెరీర్ ముగింపు దశకు చేరుకునే వయసులోనూ జోష్నా అంతర్జాతీయ స్థాయిలో తన ప్రదర్శనను కొనసాగిస్తున్నారు. ఏషియన్ గేమ్స్‌లో ఏడోసారి భారత్‌కు ప్రాతినిధ్యం వహించడం ఆమె సుదీర్ఘ కెరీర్‌కు నిదర్శనంగా నిలిచింది. తాజా విజయం తర్వాత జోష్నా.. దేశం కోసం పతకం గెలవడం తన కెరీర్‌లో ఎప్పటికీ ప్రత్యేకమైన ప్రేరణ అని పేర్కొన్నారు.

# షూటింగ్‌లో ఆరో రోజు భారత్‌కు స్వర్ణం, రజతం!



జపాన్‌లోని ఐచీ-నగోయాలో జరుగుతున్న ఆసియా గేమ్స్ ఆరో రోజు భారత అథ్లెట్లకు అద్భుతమైన ఆరంభం లభించింది. భారత షుటర్లు తమ మార్క్ నైపుణ్యాన్ని ప్రదర్శించడంతో దేశ ఖాతాలో ఒక స్వర్ణం, ఒక రజత పతకం చేరాయి. ఈ విజయాలతో ఆసియా గేమ్స్‌లో భారత్ సాధించిన మొత్తం పతకాల సంఖ్య 19కి చేరింది. 10 మీటర్ల ఎయిర్ పిస్టల్ మిక్స్‌డ్ టీమ్ ఫైనల్ ఈవెంట్‌లో భారత్‌కు చెందిన సురుచి, కమల్‌జీత్ జోడీ అద్భుత ప్రదర్శనతో పసిడి పతకాన్ని ముద్దాడింది. ఈ కాంబినేషన్ కేవలం స్వర్ణంతో సరిపెట్టకుండా, క్వాలిఫికేషన్ రౌండ్‌లోనే ఆసియా రికార్డును సమం చేసి సరికొత్త సంచలనం సృష్టించింది. పురుషుల 50 మీటర్ల రైఫిల్ 3 పొజిషన్స్ టీమ్ ఈవెంట్‌లోనూ భారత్ మెరిసింది. ఐశ్వరీ ప్రతాప్ సింగ్ తోమర్, నీరజ్ కుమార్, రుద్రాంక్ష్ పాటిల్‌లతో కూడిన భారత జట్టు స్థిరమైన ప్రదర్శనతో రజత పతకాన్ని కైవసం చేసుకుంది. మరోవైపు ఇతర క్రీడల్లోనూ భారత్‌కు పతకాలు ఖాయమయ్యాయి. టేబుల్ టెన్నిస్ మిక్స్‌డ్ డబుల్స్‌లో దియా చౌతాలే -- మనుష్ షా జోడీ సెమీ ఫైనల్‌కు దూసుకెళ్లి భారత్‌కు కనీసం కాంస్యాన్ని ఖరారు చేసింది. అలాగే స్క్వాష్ మిక్స్‌డ్ డబుల్స్ విభాగంలో వెటరన్ ప్లేయర్ జోష్నా చినప్ప -- వెలవన్ సెంథిల్‌కుమార్ జంట కూడా సెమీస్‌కు చేరి పతకాన్ని నిలబెట్టుకుంది.

**నేడు కబడ్డీ, అథ్లెటిక్స్ మ్యాచ్‌లపైనే దృష్టి**

ప్రస్తుతం క్రీడాభిమానుల దృష్టి కబడ్డీ సెమీఫైనల్స్‌పై నిలిచింది. పురుషుల, మహిళల జట్లు రెండూ తమ కీలకమైన మ్యాచ్‌లు ఆడనున్నాయి. వీటితో పాటు ట్రాక్ అండ్ ఫీల్డ్ ఈవెంట్లలో మహిళల షాట్‌పుట్, పోల్ వాల్ట్, పురుషుల 10,000 మీటర్లు, హ్యామర్ త్రో వంటి విభాగాల్లో భారత అథ్లెట్లు పతకాల కోసం బరిలోకి దిగనున్నారు.

# ఆస్ట్రేలియా-ఏపై భారత్-ఏ ఘన విజయం



ఆస్ట్రేలియా-ఏతో జరిగిన తొలి నాలుగు రోజుల మ్యాచ్‌లో భారత్-ఏ జట్టు 162 పరుగుల భారీ తేడాతో ఘన విజయం సాధించింది. పుదుచ్చేరిలోని సీఏపీ-సీషెమ్ స్టేడియంలో జరిగిన ఈ మ్యాచ్‌లో బ్యాటింగ్, బౌలింగ్ విభాగాల్లో సమష్టిగా రాణించిన భారత్-ఏ విజయం అందుకుంది. భారత్-ఏ స్పిన్నర్ షామ్స్ ములానీ బౌలింగ్‌లో కీలక పాత్ర పోషించాడు. రెండో ఇన్నింగ్స్‌లో మూడు వికెట్లు పడగొట్టిన అతడు మ్యాచ్ మొత్తంలో 124 పరుగులు ఇచ్చి ఏడు వికెట్లు తన ఖాతాలో వేసుకున్నాడు. 363 పరుగుల భారీ లక్ష్యాన్ని ఛేదించేందుకు చివరి రోజు 55/2 ఓవర్‌నైట్ స్కోరుతో ఆస్ట్రేలియా-ఏ బ్యాటింగ్ ప్రారంభించింది. అయితే భారత బౌలర్ల ధాటికి ఆసీస్ బ్యాటర్లు ఎక్కువసేపు క్రీజులో నిలవలేకపోయారు. మీడియం పేసర్ అన్షుల్ కంబోజ్ తొలి గంటలోనే ఓవర్‌నైట్ బ్యాటర్లు నాథన్ మెక్‌స్వీనీ (35), కెప్టెన్ పీటర్ హ్యాండ్స్‌కోంబ్ (16)లను పెవిలియన్‌కు పంపాడు. దీంతో ఆస్ట్రేలియా-ఏ కష్టాల్లో పడింది. ఆ తర్వాత తుషార్ దేశ్‌పాండే వరుస బంతుల్లో జోష్ ఫిలిప్, లియామ్ స్కాట్‌లను ఔట్ చేసి ఆసీస్ పతనాన్ని మరింత వేగవంతం చేశాడు. లంచ్ సమయానికి ఆస్ట్రేలియా-ఏ 185/7తో నిలిచింది.

**200 పరుగులకే ఆలౌట్**

లంచ్ తర్వాత షామ్స్ ములానీ మిగిలిన వికెట్లను పడగొట్టడంతో ఆస్ట్రేలియా-ఏ ఇన్నింగ్స్‌కు తెరపడింది. ఆసీస్ తరఫున ఫెర్గస్ ఓ'నీల్ 47 పరుగులతో టాప్ స్కోరర్‌గా నిలిచాడు. చివరికి ఆస్ట్రేలియా-ఏ 55.1 ఓవర్లలో 200 పరుగులకు ఆలౌటైంది. దీంతో భారత్-ఏ 162 పరుగుల తేడాతో విజయాన్ని సొంతం చేసుకుంది.

**రెండో ఇన్నింగ్స్‌లో పడిక్కల్ అర్ధశతకం**

అంతకుముందు తొలి ఇన్నింగ్స్‌లో భారత్-ఏ 163 పరుగుల ఆధిక్యం సాధించింది. రెండో ఇన్నింగ్స్‌లో కెప్టెన్ దేవదత్ పడిక్కల్ 59 పరుగులతో కీలక అర్ధశతకం సాధించాడు. ఓపెనర్ సాయి సుదర్శన్ (39)తో కలిసి పడిక్కల్ రెండో వికెట్‌కు 68 పరుగుల భాగస్వామ్యాన్ని నెలకొల్పాడు. అయితే పడిక్కల్ ఔటైన తర్వాత భారత్-ఏ బ్యాటింగ్ ఒక్కసారిగా తడబడింది. పడిక్కల్ వికెట్ అనంతరం భారత్-ఏ చివరి ఆరు వికెట్లను కేవలం 48 పరుగులకే కోల్పోయింది. దీంతో జట్టు రెండో ఇన్నింగ్స్‌లో 199 పరుగులకు ఆలౌటైంది. తొలి ఇన్నింగ్స్‌లో అద్భుతమైన సెంచరీతో ఆకట్టుకున్న కుమార్ కుశాగ్ర 46 పరుగులతో నాటౌట్‌గా నిలిచి చివరి వరకు పోరాడాడు.

**ప్లేయర్ ఆఫ్ ది మ్యాచ్ కుశాగ్ర**

తొలి ఇన్నింగ్స్‌లో సెంచరీ చేసి భారత్-ఏ భారీ స్కోరుకు పునాది వేసిన కుమార్ కుశాగ్రకు ప్లేయర్ ఆఫ్ ది మ్యాచ్ అవార్డు దక్కింది. అతడి సెంచరీతో పాటు భారత బౌలర్ల సమష్టి ప్రదర్శన జట్టు విజయానికి కీలకంగా నిలిచింది.

**సెప్టెంబర్ 29 నుంచి రెండో మ్యాచ్**

భారత్-ఏ, ఆస్ట్రేలియా-ఏ జట్ల మధ్య రెండో మ్యాచ్ సెప్టెంబర్ 29 నుంచి అక్టోబర్ 2 వరకు ఇదే వేదికపై జరగనుంది. అనంతరం ఇరు జట్ల మధ్య మూడు వన్డేల సిరీస్ జరగనుంది.

# సీఎస్‌కే హెడ్ కోచ్‌గా నియమితుడయ్యాక తొలిసారిగా స్పందించిన జహీర్ ఖాన్



చెన్నై సూపర్ కింగ్స్ (సీఎస్‌కే) నూతన హెడ్ కోచ్‌గా నియమితుడైన భారత మాజీ పేసర్ జహీర్ ఖాన్ తొలిసారిగా స్పందించాడు. ఐదుసార్లు ఐపీఎల్ ఛాంపియన్‌గా నిలిచిన జట్టుకు కోచ్‌గా ఉండటం గౌరవంతో పాటు అతిపెద్ద బాధ్యత అని అన్నాడు. సుదీర్ఘకాలం కోచ్‌గా పనిచేసిన స్టీఫెన్ ఫ్లెమింగ్ వంటి దిగ్గజం స్థానాన్ని భర్తీ చేయడం సవాలుతో కూడుకున్నదని, అదే సమయంలో ఆసక్తికరంగా ఉంటుందని పేర్కొన్నాడు. 2027 ఐపీఎల్ సీజన్‌కు గాను జహీర్‌ను సీఎస్‌కే హెడ్ కోచ్‌గా నియమించిన సంగతి తెలిసిందే. ఈ సందర్భంగా ఫ్రాంచైజీ అధికారిక యూట్యూబ్ ఛానెల్‌తో జహీర్ మాట్లాడుతూ, "ఇప్పుడు నేను సీఎస్‌కే హెడ్ కోచ్ ను. ఈ ఫీలింగ్ కు ఇంకా అలవాటు పడుడుతున్నాను. అభిమానులు, శ్రేయోభిలాషుల నుంచి ఎంతో ప్రేమ, ఆప్యాయత అందుతోంది. నా కెరీర్‌లో ఈ కొత్త అధ్యాయం కోసం ఆసక్తిగా ఎదురుచూస్తున్నాను. సీఎస్‌కేకు గొప్ప చరిత్ర, వారసత్వం ఉన్నాయి. అలాంటి జట్టుకు ప్రాతినిధ్యం వహించడం ఒత్తిడితో కూడుకున్నదే. భారీ అంచనాలను అందుకోవడం సవాలుతో కూడుకున్నది, కానీ నేను దానికి సిద్ధంగా ఉన్నాను" అని తెలిపాడు. తన నియామక ప్రక్రియ చాలా సరళంగా, సూటిగా జరిగిందని జహీర్ వివరించాడు. "సీఎస్‌కేలో ధోనీ ఒక గొప్ప శక్తి. జట్టు ప్రయాణించాల్సిన దిశను నిర్దేశించడంలో అతడి పాత్ర కీలకం. ఫ్రాంచైజీ ఓనర్లు, సీఈవో కాశీ విశ్వనాథన్ నాతో మాట్లాడారు. మీకు ఆసక్తి ఉందా, అందుబాటులో ఉంటారా అని అడిగారు. ఇది నాకు దక్కిన గౌరవంగా భావించి వెంటనే అంగీకరించాను. నా సామర్థ్యంపై వారు ఉంచిన నమ్మకం నాకు మరింత ఆత్మవిశ్వాసాన్ని ఇస్తోంది" అని అన్నాడు. ఫ్లెమింగ్, ధోనీల భాగస్వామ్యం గురించి జహీర్ ప్రశంసలు కురిపించాడు. "వారి మధ్య ఉన్న సమన్వయం, స్థిరత్వం చాలా ప్రత్యేకమైనవి. వారి వల్లే సీఎస్‌కే ప్రపంచంలోని అత్యంత విజయవంతమైన టీ20 ఫ్రాంచైజీలలో ఒకటిగా నిలిచింది. వారు నిర్మించిన బ్రాండ్ ఆఫ్ క్రికెట్‌ను కాపాడటంతో పాటు, దానిని ముందుకు తీసుకెళ్లడమే నా ముందున్న లక్ష్యం" అని జహీర్ పేర్కొన్నాడు. చెన్నైతో తనకున్న పాత అనుబంధాన్ని కూడా జహీర్ గుర్తుచేసుకున్నాడు. "నా కెరీర్ తొలినాళ్లలో చెన్నైలోని ఎంఆర్‌ఎఫ్ పేస్ ఫౌండేషన్‌లో ఆస్ట్రేలియా దిగ్గజం డెన్నిస్ లిల్లీ వద్ద దాదాపు మూడేళ్లు శిక్షణ పొందాను. అప్పట్లో అన్నా నగర్‌లో ఉంటూ చెన్నైలో లీగ్ క్రికెట్ కూడా ఆడాను. అందుకే ఈ నగరంతో నాకు ప్రత్యేక అనుబంధం ఉంది. సీఎస్‌కేకు రావడం సొంత ఇంటికి వచ్చినట్లుగా అనిపిస్తోంది" అని అన్నాడు. అభిమానుల నుంచి వస్తున్న స్పందన చూస్తుంటే సరైన చోటుకే వచ్చాననిపిస్తోందని, చెపాక్ స్టేడియంలో వారి ప్రేమను ప్రత్యక్షంగా చూసేందుకు ఎదురుచూస్తున్నానని జహీర్ ముగించాడు.

తెలుగురాష్ట్రం దినపత్రిక

# ‘లవ్ అండ్ వార్’ నుంచి ఆలియా భట్ ఫస్ట్ లుక్ విడుదల



బాలీవుడ్ మోస్ట్ యాంటిసిపేటెడ్ ప్రాజెక్ట్ ‘లవ్ అండ్ వార్’ సినిమా నుంచి క్రేజీ అప్‌డేట్ వచ్చేసింది. ఈ చిత్రం నుంచి హీరోయిన్ ఆలియా భట్ ఫస్ట్ లుక్‌ను చిత్రయూనిట్ అధికారికంగా విడుదల చేసింది. “ఆగ్ భీ, దిల్ కీ జాన్ భీ!” అనే క్యాప్షన్‌తో విడుదల చేసిన ఈ పోస్టర్ సోషల్ మీడియాలో విశేషంగా ఆకట్టుకుంటూ క్షణాల్లో వైరల్‌గా మారింది. పోస్టర్‌లో ఆలియా లుక్ చాలా పవర్‌ఫుల్‌గా, భావోద్వేగభరితంగా కనిపిస్తోంది. దిగ్గజ దర్శకుడు సంజయ్ లీలా భన్సాలీ ఈ భారీ బడ్జెట్ రొమాంటిక్ డ్రామాను ఎంతో ప్రతిష్టాత్మకంగా తెరకెక్కిస్తున్నారు. ఈ చిత్రంలో ఆలియా భట్‌తో పాటు బాలీవుడ్ స్టార్ హీరోలు రణ్‌బీర్ కపూర్, విక్కీ కౌశల్ ప్రధాన పాత్రల్లో నటిస్తున్నారు. భన్సాలీ మార్క్ విజువల్స్, అద్భుతమైన కథనంతో రూపుదిద్దుకుంటున్న ఈ మల్టీస్టారర్ ప్రాజెక్ట్‌పై పరిశ్రమలో భారీ అంచనాలు నెలకొన్నాయి. చిత్ర నిర్మాణ పనులు శరవేగంగా సాగుతుండటంతో, మేకర్స్ ఈ సినిమా విడుదల తేదీని కూడా అధికారికంగా ప్రకటించారు. ఈ భారీ చిత్రాన్ని 2027 జనవరి 21న ప్రపంచవ్యాప్తంగా థియేటర్లలో విడుదల చేయనున్నట్లు స్పష్టం చేశారు. రణ్‌బీర్, ఆలియా, విక్కీ కౌశల్‌ల కాంబినేషన్ వెండితెరపై ఎలాంటి మ్యాజిక్ క్రియేట్ చేస్తుందో చూడాలని అభిమానులు ఆసక్తిగా ఎదురుచూస్తున్నారు.

# విజయ్‌కి వీరతిలకం..

## ఇక ఫ్యాన్స్ కు ఆ సందేహం అవసరం లేదు !!




‘రౌడీ బాయ్’ విజయ్ దేవరకొండ కథానాయకుడిగా, రాహుల్ సాంకృత్యాయన్ దర్శకత్వంలో తెరకెక్కుతున్న పిరియాడిక్ యాక్షన్ డ్రామా ‘రణబాలి’ థియేటర్లలోకి రావడం ఆలస్యమవుతుందనే ప్రచారంపై మైత్రీ మూవీ మేకర్స్ ఘాటుగా స్పందించారు. సినిమా వాయిదా పడటం లేదని, ముందుగా ప్రకటించిన విధంగానే అక్టోబర్ 16నే ప్రపంచవ్యాప్తంగా గ్రాండ్‌గా విడుదల చేయనున్నట్లు ‘ఎక్స్’ (ట్విట్టర్) వేదికగా స్పష్టం చేశారు. ఈ విషయాన్ని తెలియజేస్తూ విజయ్ దేవరకొండ నూతన పోస్టర్‌ను సైతం మేకర్స్ విడుదల చేశారు. అందులో విజయ్ నొసట వీరతిలకం దిద్దుతున్నట్లు ఉన్న దృశ్యం అభిమానులను విశేషంగా ఆకట్టుకుంటోంది. ఈ ఒక్క ప్రకటనతో సినిమా విడుదల తేదీపై ఫ్యాన్స్‌లో ఉన్న అనుమానాలన్నీ పటాపంచలైపోయాయి. ‘టాక్సీవాలా’, ‘శ్యామ్ సింగరాయ్’ చిత్రాల తర్వాత దర్శకుడు రాహుల్ సాంకృత్యాయన్ తెరకెక్కిస్తున్న చిత్రం కావడం, అలాగే ‘గీత గోవిందం’, ‘డియర్ కామ్రేడ్’ విజయాకాల తర్వాత విజయ్ దేవరకొండ–రష్మిక మందన్న కలిసి నటిస్తున్న హ్యాట్రిక్ మూవీ కావడంతో ‘రణబాలి’పై భారీ అంచనాలు నెలకొన్నాయి. ఇప్పటికే ఈ సినిమా నుంచి విడుదలైన టీజర్, సాంగ్స్ విశేషమైన ఆదరణ పొంది, యూట్యూబ్‌లో ట్రెండింగ్‌లో నిలిచాయి. విజయ్ సరికొత్త మాస్ మరియు పవర్ ఫుల్ లుక్, విజువల్ గ్రాండియర్ కాంబినేషన్‌లో వస్తున్న ఈ పీరియడ్ డ్రామాతో బాక్సాఫీస్ వద్ద విజయం సాధించడం ఖాయమని చిత్రబృందం మరియు అభిమానులు ధీమా వ్యక్తం చేస్తున్నారు.

## కొత్త నటీనటులకు

# రిషబ్ శెట్టి ఛాన్స్..

## బెంగళూరులో ఓపెన్ ఆడిషన్స్



‘కాంతార’తో దేశవ్యాప్తంగా గుర్తింపు తెచ్చుకున్న నటుడు, దర్శకుడు రిషబ్ శెట్టి తన నిర్మాణ సంస్థ ద్వారా కొత్త సినిమా కోసం ఓపెన్ కాస్టింగ్ కాల్ ప్రకటించారు. సినిమా రంగంలో అడుగుపెట్టాలని ఆశించే కొత్త ప్రతిభకు ఈ ఆడిషన్ ఒక అవకాశం కానుంది. ఆడిషన్లు అక్టోబర్ 2న బెంగళూరులోని విజయా కాలేజీలో నిర్వహించనున్నారు. పురుషులకు 20 నుంచి 65 ఏళ్లు, మహిళలకు 20 నుంచి 60 ఏళ్ల వయోపరిమితి నిర్ణయించారు. ఆసక్తి ఉన్నవారు రెజ్యూమ్, ప్రొఫైల్, గత పనులకు సంబంధించిన లింకులను rrrfilmz@gmail.comకు పంపవచ్చు.రిషబ్ శెట్టి తన అధికారిక ఎక్స్ ఖాతా ద్వారా ఈ వివరాలను పంచుకున్నారు. తన నిర్మాణ సంస్థ రిషబ్ శెట్టి ఫిల్మ్స్ చేపడుతున్న కొత్త ప్రాజెక్ట్ కోసం విభిన్న పాత్రలకు సరిపోయే కొత్త ముఖాలను ఎంపిక చేయనున్నట్లు పేర్కొన్నారు. సినిమాల్లో నటించాలనే కల ఉన్నవారు తమ ప్రతిభను చూపించేందుకు ఇది మంచి వేదికగా మారనుంది. అర్హతలు, ఎంపిక ప్రక్రియ, ఇతర తాజా సమాచారాన్ని రిషబ్ శెట్టి అధికారిక సోషల్ మీడియా ఖాతాల ద్వారా తెలుసుకోవాలని నిర్వాహకులు సూచించారు.

# సితార బ్యానర్‌లో ధనుష్ కొత్త చిత్రం.. పూజా కార్యక్రమాలతో లాంచ్!



కోలీవుడ్ విలక్షణ నటుడు ధనుష్ తాజాగా తన 56వ చిత్రాన్ని (ఐ56) అధికారికంగా ప్రారంభించారు. గతేడాది ‘లబ్బర్ పందు’ వంటి ఘనవిజయంతో విమర్శకుల ప్రశంసలు అందుకున్న యంగ్ డైరెక్టర్ తమిళరసన్ పచముత్తు ఈ ప్రాజెక్ట్‌కు దర్శకత్వం వహిస్తున్నారు. మధురై సమీపంలోని శివగంగ జిల్లా మారనాడు కరుప్పణస్వామి దివ్య సన్నిధిలో చిత్రబృందం సాంప్రదాయబద్ధంగా పూజా కార్యక్రమాలు నిర్వహించి చిత్రాన్ని లాంఛనంగా మొదలుపెట్టింది. పల్లెటూరి నేపథ్యంలో సాగే హై వోల్టేజ్ రూరల్ కమర్షియల్ యాక్షన్ డ్రామాగా ఈ చిత్రం రూపొందనుంది. ఈ చిత్రంలో ధనుష్ సరసన కథానాయికగా యంగ్ బ్యూటీ ప్రీతి ముకుందన్ నటిస్తోంది. అంతేకాకుండా ప్రముఖ కమెడియన్ వడివేలు, విలక్షణ నటుడు ఎస్.జె. సూర్య, ‘ఉరియడి’ ఫేమ్ విజయ్ కుమార్ కీలక పాత్రలు పోషిస్తుండటం విశేషం. ప్రముఖ నిర్మాణ సంస్థలు సితార ఎంటర్‌టైన్‌మెంట్స్, ఫైమ్‌మార్క్ ప్రొడక్షన్స్ సంయుక్తంగా ఈ భారీ ప్రాజెక్ట్‌ను నిర్మిస్తున్నాయి. ఈ చిత్రానికి సెన్సేషనల్ యంగ్ మ్యూజిక్ డైరెక్టర్ సాయి అభ్యంకర్ సంగీతం అందిస్తున్నారు. పూజా కార్యక్రమాలు పూర్తి కావడంతో అతిత్వరలోనే రెగ్యులర్ షుటింగ్ ప్రారంభం కానుంది.

# పాపం ఫంకీ బ్యూటీ..!!





కన్నడ చిత్రం ‘ముగిల్‌పేట’తో సినీ పరిశ్రమలో అడుగుపెట్టిన అందాల భామ కాయదు లోహార్‌ను వరుస పరాజయాలు వెంటాడుతున్నాయి. గ్లామర్, నటనతో ఆకట్టుకునే ప్రతిభ ఉన్నప్పటికీ, తెలుగు చిత్రసీమలో ఆమెకు లభిస్తున్న అవకాశాలు సరైన విజయాలుగా మారడం లేదు. శ్రీవిష్ణు సరసన నటించిన ‘అల్లూరి’ మరియు ఆ తర్వాత వచ్చిన ‘ఫంకీ’ వంటి చిత్రాలు బాక్సాఫీస్ వద్ద ఆశించిన స్థాయిలో రాణించలేకపోయాయి. దీంతో మంచి ఆఫర్లు వస్తున్నప్పటికీ, కమర్షియల్ హిట్స్ లేకపోవడం ఆమె టాలీవుడ్ కెరీర్‌కు పెద్ద ప్రతిబంధకంగా మారింది. తాజాగా నాని, శ్రీకాంత్ ఓదెల కాంబినేషన్‌లో వచ్చిన ప్రతిష్టాత్మక చిత్రం ‘ది ప్యారడైజ్’లో అవకాశం దక్కించుకున్నప్పటికీ, అది ఆమె కెరీర్‌కు ఏమాత్రం ఉపయోగపడలేదు. ఈ సినిమాలో తండ్రి చేసిన అప్పులను తీర్చే క్రమంలో బి–గ్రేడ్ చిత్రాలలో నటించే విచిత్రమైన పాత్రలో ఆమె కనిపించడం ప్రేక్షకులకు తీవ్ర అసహనాన్ని కలిగించింది. ఇటువంటి అభ్యంతరకర పాత్రలను ఎంచుకోవడం వల్ల ప్రశంసల కంటే నెగెటివిటీయే ఎక్కువ మూటగట్టుకోవాల్సి వచ్చింది. గ్లామర్ పాత్రలైనా, ప్రాధాన్యత ఉన్న పాత్రలైనా ఎంచుకునేటప్పుడు మరింత జాగ్రత్త వహించాలని, ఇప్పటికైనా కథల ప్రాధాన్యతను గుర్తించి నిర్ణయాలు తీసుకోకపోతే కెరీర్‌లో నిలదొక్కుకోవడం కష్టమని సినీ విశ్లేషకులు అభిప్రాయపడుతున్నారు.

# జాతీయ అందాల పోటీల్లో అదరగొట్టిన ఆదిలాబాద్ యువతి



ఆదిలాబాద్ జిల్లా ఇంద్రవెల్లి మండలం హీరాపూర్ గ్రామానికి చెందిన గిరిజన యువతి ప్రీతి ముండే జాతీయ స్థాయిలో అద్భుత విజయం సాధించింది. రాజస్థాన్‌లోని జైపూర్‌లో జరిగిన ప్రఖ్యాత ‘మిస్ డివైన్ బ్యూటీ 2026’ గ్రాండ్ ఫినాలేలో ఆమె ప్రతిభ కనబరిచింది. ఈ వేడుకలో ‘మిస్ ఇండియా ఎర్త్ వాటర్ 2026’ కిరీటాన్ని కైవసం చేసుకోవడంతో పాటు, ‘మిస్ కంజీనియాలిటీ’ ప్రత్యేక పురస్కారాన్ని కూడా గెలుచుకుని అందరి ప్రశంసలు అందుకుంది. డివైన్ బ్యూటీ గ్రూప్ నిర్వహించిన ఈ ప్రతిష్ఠాత్మక పోటీల్లో ప్రీతి తెలంగాణ రాష్ట్రం తరఫున ప్రాతినిధ్యం వహించింది. మహారాష్ట్రకు చెందిన ఆర్య ఆవధూత్ ప్రధాన టైటిల్ గెలుచుకోగా, అత్యంత కీలకమైన ఎలిమెంటల్ టైటిల్స్ లో ఒకటైన ‘వాటర్’ కిరీటాన్ని ప్రీతి సొంతం చేసుకుంది. గ్రామీణ నేపథ్యం నుంచి వచ్చి మోడలింగ్ రంగంలో అడుగుపెట్టిన ఆమె, గతంలో ‘మిస్ హైదరాబాద్ రన్నరప్’ మరియు ‘మిస్ మహారాష్ట్ర (బ్రెయిన్ విత్ బ్యూటీ)’ వంటి టైటిళ్లను కూడా సాధించడం విశేషం. సాధారణ గిరిజన కుటుంబంలో జన్మించిన ప్రీతి ముండే తల్లిదండ్రులు ప్రహ్లాద్, ఉమా దంపతులు. కష్టాలను ఎదుర్కొంటూ హైదరాబాద్‌కు వచ్చి మోడలింగ్‌లో తనకంటూ ప్రత్యేక గుర్తింపు తెచ్చుకుంది. కేవలం మోడలింగ్ మాత్రమే కాకుండా జ్యోతిష్యం, టారోట్ రీడింగ్ వంటి సబ్జెక్టులపై కూడా ఆమె ఆసక్తి కనబరుస్తుంది. ఒక మారుమూల ఏజెన్సీ ప్రాంతం నుండి జాతీయ వేదికపైకి ఎదిగి విజేతగా నిలవడం పట్ల కుటుంబ సభ్యులు, గ్రామస్థులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

# ఓటీటీలోకి వచ్చిన ‘రంభ ఊర్వశి మేనక’





అల్లరి నరేశ్ హీరోగా తెరకెక్కిన సోషియో ఫాంటసీ ఎంటర్‌టైనర్ ‘రంభ ఊర్వశి మేనక’ ఓటీటీ ప్రేక్షకుల ముందుకు వచ్చేసింది. సెప్టెంబర్ 4న థియేటర్లలో విడుదలైన ఈ సినిమాకు మిశ్రమ స్పందన లభించింది. అయితే ఎలాంటి ముందస్తు ప్రకటన లేకుండా ఈ చిత్రం సెప్టెంబర్ 25 నుంచి ప్రముఖ ఓటీటీ ప్లాట్‌ఫామ్ అమెజాన్ ప్రైమ్ వీడియోలో సైలెంట్‌గా స్ట్రీమింగ్ అవుతోంది. దీంతో థియేటర్లలో మిస్ అయిన ప్రేక్షకులు ఇప్పుడు ఓటీటీలో ఈ సినిమాను చూసే అవకాశం దక్కింది. చంద్రమోహన్ చింతాడ దర్శకత్వంలో తెరకెక్కిన ఈ చిత్రంలో అల్లరి నరేశ్ సరసన సురభి కథానాయికగా నటించింది. ప్రముఖ హాస్య నటుడు వెన్నెల కిశోర్‌తో పాటు రాశి సింగ్, విష్ణుప్రియ, ప్రిషా సింగ్ ఇతర కీలక పాత్రలలో కనిపించారు. ప్రతిష్టాత్మక నిర్మాణ సంస్థలు అన్నపూర్ణ స్టూడియోస్, హాస్య మూవీస్ బ్యానర్లపై ఈ చిత్రాన్ని సంయుక్తంగా నిర్మించారు.

**ఆకట్టుకునే కథాంశం**

ఈ సినిమా కథ విషయానికొస్తే... నాటక కళాకారుడైన సూరి (అల్లరి నరేశ్) కుటుంబం వద్ద ఒక పురాతన మాయా పుస్తకం ఉంటుంది. దాని సహాయంతో దేవలోక సుందరులైన రంభ, ఊర్వశి, మేనకలను భూమిపైకి రప్పించవచ్చని వారి నమ్మకం. ఈ క్రమంలో తీవ్ర అనారోగ్యంతో ఉన్న తన తల్లిని కాపాడుకునేందుకు సూరి ఆ మాయా పుస్తకాన్ని ఉపయోగిస్తాడు. అనుకున్నట్లుగానే ఆ ముగ్గురు దేవకన్యలు భూమిపైకి రావడంతో, వారి రాక తర్వాత చోటుచేసుకునే వినోదాత్మక పరిణామాలు, గందరగోళం చుట్టూ ఈ కథ తిరుగుతుంది. థియేటర్లలో ఈ సినిమాకు మిశ్రమ లభించినప్పటికీ, అల్లరి నరేశ్, వెన్నెల కిశోర్‌ల మార్క్ కామెడీ టైమింగ్, వినోదం ప్రేక్షకులను బాగా ఆకట్టుకున్నాయి. థియేటర్లలో ఈ చిత్రాన్ని మిస్ అయిన ఫాంటసీ, కామెడీ సినిమాల ప్రియులు ఇప్పుడు అమెజాన్ ప్రైమ్ వీడియోలో హాయిగా వీక్షించవచ్చు.

TELUGU RASTRAM . Printed, Published and Owned by A.RAJASEKHAR. Printed at Ajay Sri Printers, D.No. 4/151, Aithabathulavari centre, S.Yanam, Uppalaguptam Mandal, Dr B.R. ambedkar konaseema Dist, A.P Published at D.No. 4-151, Aithabathulavari Centre, S.Yanam, Uppalaguptam Mandal, Dr B.R. ambedkar konaseema Dist, A.P. Editor: A.RAJASEKHAR, . RNI NO. APTEL/2016/66202, email: telugurastram2016@gmail.com, Phone No. 8074368339